
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 10 ఏప్రిల్ 2025


## 57మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు

ఖమ్మం ఖనాపురం హవేలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి మూల్యాంకనం విధులకు హాజరు కాని 57 మంది ఉపాధ్యాయులకు డీఈవో సోమశేఖరశర్మ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూల్యాంకనం సోమవారం ప్రారంభం కాగా, మొదటిరోజు నుంచే 200 మంది ఉపాధ్యాయులు విధులకు హాజరుకాలేమని క్యాంపు అధికారికి వినతిపత్రాలు అందించారు. అయితే ఆ వినతిపత్రాలను క్యాంపు అధికారి తిరస్కరించారు. అయినా.. కొందరు విధులకు గైర్హాజరు కావటంతో డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సరైన సమాధానం రాని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



### యామీ.. నీ సేవలు అమోఘం!

పోలీసు శాఖలో నేరాల దర్యాప్తులో 9 ఏళ్ల పాటు సేవలందించిన పోలీసు జాగిలం యామి (ఫిమేల్ డాగ్) అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. ఈ సందర్భంగా ఖమ్మం పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో జాగిలం హ్యాండ్లర్ సురేష్‌తో కలిసి ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, ఏసీపీ నరసయ్య.. యామీకి నివాళులర్పించి, అధికార లాంఛనాలతో ఖననం చేశారు. స్లీపర్ (వాసన చూడడం), బాంబులు, మందుపాతరలు గుర్తించడంలో యామి చాకచక్యంగా వ్యవహరించేదని వారు గుర్తు చేసుకున్నారు.
-ఆంధ్రజ్యోతి, ఖమ్మం క్రైం



### ఎదగాలి ఇంతకు ఇంతై...

ఖమ్మం సారధినగర్‌కు చెందిన మౌనిక-సురేష్ దంపతులు మార్చి 1న ఆడ పిల్లకు జన్మనివ్వగా... 'మా పాప-మా ఇంటి మణిదీపం' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం వారి ఇంటికి వెళ్లి అభినందించారు. స్వీట్ బాక్స్, పండ్లు, దుస్తులు అందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆడపిల్ల పుడితే భారంగా భావించకుండా, ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. ప్రోత్సహిస్తే ఆడపిల్లలు ఎంతో ఎదుగుతారని అన్నారు. ఈ సందర్భంగా సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు.
-ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్



### కమనీయం.. కల్యాణ రాముడి తెప్పోత్సవం

భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పవిత్ర గోదావరిలో కల్యాణ రాముడికి తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అందంగా అలంకరించిన పడవలో కల్యాణరాముడు విహరించాడు. అనంతరం దొంగల దోపు ఉత్సవం సంప్రదాయబద్ధంగా సాగింది. రాత్రి స్వామి వారికి దొంగల దోపోత్సవాన్ని నిర్వహించగా వేలాది మంది భక్తులు ఆహ్లాదకర వాతావరణంలో తిలకించారు. ఈ కార్యక్రమంలో వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.
- ఆంధ్రజ్యోతి, భద్రాచలం



యర్రా శ్రీకాంత్ పాడె మోస్తున్న అరుణ్, పోతినేని, నున్నా

## యర్రా శ్రీకాంత్‌కు రెడ్ సెల్యూట్

- తుది వీడ్కోలు పలికిన సీపీఎం శ్రేణులు
- పాడె మోసిన అరుణ్, పోతినేని, నున్నా
- అంతిమయాత్రలో పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర కమిటీల బాధ్యులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధితో ఆకస్మికంగా మృతిచెందిన సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ భౌతికకాయానికి సీపీఎం శ్రేణులు రెడ్ సెల్యూట్ పలుకుతూ కన్నీటి వీడ్కోలు పలికాయి. ఖమ్మంలోని శ్రీకాంత్ నివాసం నుంచి కాల్వొడ్డులోని వైకుంఠధామం వరకు అంతిమ యాత్ర సాగింది. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్‌కుమార్... శ్రీకాంత్ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో అరుణ్‌కుమార్‌తో పాటుగా పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు పాడె మోశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్... శ్రీకాంత్ భౌతికకాయంపై పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన (మిగతా 4వ పేజీలో)

మెరక ప్రాంత భూములకు సాగు నీరందించే లక్ష్యంతో దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు పాలకుల నిర్లక్ష్యం, రైతుల మధ్య సమన్వయ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం రైతులకే అప్పగించినా.. మరమ్మతుల విషయంలో సమన్వయ లోపంతో అనేక లిఫ్ట్‌లు నిరుపయోగంగా మారాయి. ఫలితంగా వాటి కింద సాగులో ఉన్న భూములు బీళ్లుగా మారుతున్నాయి. వాగులు, చెరువులు కాలువలు, ఏర్ల నుంచి నీటిని ఎత్తిపోసి మెరక ప్రాంతాలను సాగునీరందించేందుకు ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వాలు వందల సంఖ్యలో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశాయి. మొదట్లో కొంత పనిచేసినా.. తర్వాత మరమ్మతుకు గురై నిరుపయోగంగా మారాయి.




పిచ్చి మొక్కలు అల్లుకుని లోపలికి పోవటానికి వీలు లేకుండా ఉన్న మధిర మండలం దెందుకూరు లిఫ్ట్

# ఎత్తిపోతలు ఉత్త కోతలు

## ఉమ్మడి జిల్లాలో అస్తవ్యస్తంగా లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు

- నిర్వహణలో రైతుల మధ్య సమన్వయ లోపం
- మరమ్మతులకు గురైతే పట్టించునే వారు కరువు
- నిధులపై హామీలతోనే సరిపెడుతున్న పాలకులు
- మెరక ప్రాంతాలకు నీరందక బీళ్లుగా భూములు

ఖమ్మం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష ఎకరాల వరకు ఎత్తిపోతల ద్వారా సాగు చేయాలని లక్ష్యం పెట్టుకుని పలుచోట్ల ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పథకానికి రూ.10లక్షల నుంచి రూ.19కోట్ల వరకు ఖర్చు చేసి నిర్మించారు. గతంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా గోదావరి, కిన్నెరసాని, మున్నేరు, తదితర చోట్ల ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. అలాగే ఎన్నెస్పీ ఆధ్వర్యంలో సాగర్ కాలువలపై కూడా ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. భద్రాచలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఐటీడీఏ నుంచి ఐపాడ్ పథకంలో సుమారు రూ.20 కోట్లతో 20 ఏళ్ల క్రితం ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. గిరిజన గ్రామాల్లో అనే వాగుల వెంట లిఫ్టులు ఏర్పాటుచేసి వరి, పత్తి మొక్కజొన్నతో పాటు పలు ఆహార, వాణిజ్య పంటలకు సాగునీరందించారు. కానీ అవన్నీ నేడు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారాయి.

**సమన్వయలోపమే శాపం..**

ఉమ్మడి రాష్ట్రంలో జలగం వెంగళరావు సీఎంగా ఉన్నప్పటి నుంచి శీలం సిద్ధారెడ్డి, ఆ తర్వాత తుమ్మల నాగేశ్వరరావు హయాంలో ఎక్కువశాతం ఎత్తిపోతల పథకాలు జిల్లాలో నిర్మించారు. జిల్లాలో ఎక్కువశాతం చిన్ననీటి, భారీనీటిపారుదలశాఖ మంత్రిగా తుమ్మలతో కృషితో అనేక ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. అయితే ఆయకట్టు రైతుల మధ్య విబేధాలు, ఎత్తిపోతల పథకాల నిర్వహణకు (మిగతా 4వ పేజీలో)

### బోర్లు వేసుకునేందుకు ఆర్థిక సహాయం చేయాలి

మల్లయ్య, బండారుగూడెం రైతు, దుమ్ముగూడెం మండలం



ఏళ్ల తరబడి ఎత్తిపోతల పథకాలు పని చేయడం లేదు. దీంతో మాలాంటి సన్నకారు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వేసిన పంటలకు సాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం వ్యక్తిగతంగా బోర్లు వేసుకునేందుకు ఆర్థిక సహాయం చేయాలి.

## సత్తుపల్లిలో దొంగల బీభత్సం

- పీవీ నరసింహారావు సెంటినరీ కాలనీలో చోరీలు
- 8 ఇళ్లల్లో రూ.85 లక్షలకు పైగా విలువైన సొత్తు చోరీ జరిగినట్టు ప్రాథమికంగా అంచనా
- తాళాలు వేసిన ఇళ్లలో అర్ధరాత్రి రెచ్చిపోయిన దొంగలు
- చోరీలో ముగ్గురు వ్యక్తులు పాల్గొన్నట్టు గుర్తింపు



సీసీ కెమెరాల్లో రికార్డయిన దొంగల కదలికలు

సత్తుపల్లి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని పీవీ నరసింహారావు సెంటినరీ కాలనీలో భారీ చోరీ జరిగింది. మంగళవారం రాత్రి ఎవరూలేని 8 ఇళ్లల్లోకి ముగ్గురు దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. ఈ క్రమంలో సుమారు రూ.85 లక్షలకు పైగా విలువైన సొత్తు కాజేసినట్లు తెలుస్తోంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాము దేశవిదేశాల పర్యటనకు, ఆరోగ్యరీత్యా ఆస్పత్రులకు, పెళ్లిళ్ల, ఫంక్షన్లకు వెళ్లిన సమయంలో ఇళ్లలో ఎవరూలేని సమయాన్ని అదనుగా భావించి ఈ చోరీ జరిగిందని వాపోయారు. బాధితుల ఫిర్యాదుమేరకు కల్లూరు ఏసీపీ ఏ.రఘు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఖమ్మం క్లూస్ టీమ్ సింగరేణి క్వార్టర్స్‌కు చేరుకుని ఫింగర్‌ప్రింట్స్, దొంగతనం జరిగిన తీరును నమోదు చేశారు. పోలీస్ జాగిలంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే దొంగతనానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు మాస్కులు ధరించి ఉండడంతో గుర్తించడం కష్టంగా మారగా క్వార్టర్స్‌లో తిరిగిన వీడియో ఫుటేజీల ఆధారంగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

**తేలని సొత్తు విలువ..**

క్వార్టర్స్‌లో చోరీ అయిన ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో ఎంత నగదు, బంగారు, వెండి ఆభరణాలు, వస్తువులు అపహరణకు గురయ్యాయో వాళ్లు వస్తేనే తెలియనుంది. సుమారుగా రూ.85లక్షలకు పైగా విలువైన వెండి, బంగారు ఆభరణాలతోపాటు విలువైన వస్తువులు, నగదు అపహరణకు గురైనట్లు ప్రాథమికంగా (మిగతా 4వ పేజీలో)



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న మాజీమంత్రి పువ్వాడ అజయ్

## రజతోత్సవ సభకు భారీగా తరలాలి

- తెలంగాణ అభివృద్ధిలో బీఆర్ఎస్‌ది కీలకపాత్ర
- హామీల అమలులో రేవంత్ ప్రభుత్వం విఫలం: మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ 25ఏళ్ల రజతోత్సవ సభను జయప్రదం చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కోరారు. నగరంలోని మమత ఆస్పత్రి క్యాంపస్‌లోని తన నివాసంలో బుధవారం నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లానుంచి పెద్దఎత్తున వరంగల్ సభకు హాజరయ్యేలా ప్రతి ఒక్కరు చూడాలన్నారు. ఖమ్మం నియోజకవర్గం నుంచి 10 వేల మందిని సభకు తరలించా లని, సభ తర్వాత ఆన్‌లైన్‌లో సభ్యత్వాల నమోదు, కొత్త కమిటీల ఏర్పాటు ఉంటుందని తెలిపారు.

2001లో పిడికెడు మందితో పెట్టిన టీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్లలో బలమైన పార్టీగా అవతరించిందని, అనేక కుట్రలు, కుతంత్రాలు తట్టుకుని ఉద్యమ పార్టీగా పనిచేసి రాష్ట్రం సాధించిందన్నారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణలో సాగు, తాగునీరు కరెంట్ సమస్యలు తొలిగి పోయామని, మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ వంటి ప్రాజెక్టులతో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందడుగు వేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఏ పథకం సక్రమంగా అమలుకావడం లేదన్నారు. కల్యాణలక్ష్మి, తులంబంగారం, ఆడపిల్లలకు స్కూటీలు వంటి హామీలు అమలుకాలేదన్నారు. అబద్దాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడంలేదని అన్నివర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. కార్యక్రమంలో నగర, మండల అధ్యక్షులు పగడాల నాగరాజు, వీరునాయక్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల, టేకులపల్లి సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ మక్బూల్, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఖమర్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

- కేంద్రాల్లో కుప్పలుగా నిల్వ ఉన్న ధాన్యం రాశులు
- రోజుల తరబడి రైతుల పడిగాపులు
- అకాల వర్షాలతో ఇప్పటికే నష్టపోయిన రైతులు
- జాడలేని మిల్లర్లు.. ముందుకు సాగని కొనుగోళ్లు
- వాతావరణంలో మార్పులతో గుబులు



పుల్లయ్యబంజర ఐకేపీ కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం రాశులు

కల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యాసంగి వరి సాగులో జిల్లాలో అగ్రగామిగా నిలిచిన కల్లూరు మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో ధాన్యానికి మద్దతు ధర చెల్లించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను అట్టహాసంగా ప్రారంభించింది. కానీ నేటివరకు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు రైస్‌మిల్లులను కేటాయించకపోవటం, గన్ని సంచులు రాకపోవటంతో కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో కేంద్రాల వద్ద ధాన్యం రాశులుగా పేరుకుపోయాయి. కల్లూరు మండలంలో పలు గ్రామాల్లో ఈ యాసంగిలో సుమారు 33 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేశారు. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో ఉంది. ఇక మార్కెట్లో ధాన్యం మద్దతు ధరకు అమ్ముకుందామంటే గత వారంరోజుల నుంచి ఎదురవుతున్న అకాలవర్షాలు రైతులకు శాపంగా మారాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై ఆశలు వదులుకొని పచ్చి ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇంకా 80 శాతం మంది రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుందామనుకుంటే అధికారుల పర్యవేక్షణ లేక కొనుగోలులో జాప్యం జరుగుతోంది. కల్లూరు మండలంలోని పుల్లయ్యబంజర ఐకేపీ ధాన్యం (మిగతా 4వ పేజీలో)



ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, రైతులు

## రుణమాఫీ నూరుశాతం అమలు చేయాలి

- సమగ్ర బీమా పథకాన్ని ప్రకటించాలి
- టీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హేమంతరావు
- నగరంలో ర్యాలీ.. కలెక్టరేట్ ఎదుట నిరసన
- కలెక్టర్‌కు వినతి

4



## నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన 12.30కి హైదరాబాద్‌లో బయల్దేరి ఖమ్మం చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 తిరుమలాయపాలెం - ఇస్లావత్ తండా వద్ద సీసీ రోడ్ల ప్రారంభోత్సవం చేస్తారు. సాయంత్రం 4 తిరుమలాయపాలెం- మేడిదపల్లి వద్ద సీసీ రోడ్ల ప్రారంభోత్సవం చేస్తారు. ఆర్సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 4.30 తిరుమలాయపాలెం - ఏలువారిగూడెంలో ఈలపొంగు నాగయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారు. 5 గంటలకు తిరుమలాయపాలెం తెట్టెలపాడులో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం చేస్తారు. 5.30 తిరుమలాయపాలెం పిండిప్రోలు సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, పీఏసీఎస్ గోడౌన్, షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం చేస్తారు. 6 గంటలకు తిరుమలాయపాలెంలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం చేసి అనంతరం పీఏసీఎస్ నూతన భవన ప్రారంభోత్సవం చేస్తారు.

# సిమెంట్ పూత... నిధుల మేత...


మూడు నెలలకే కంకర బయటపడుతున్న రోడ్

» రూ.కోటి వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణం
» మూడు నెలలకే రాళ్లు తేలిన రోడ్
» ఆర్‌అండ్‌బీ శాఖ నిర్వాకమే ఇందుకు కారణం

చర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి ఒత్తిడికి చూర్ణమయ్యే కంకర, దుబ్బను పోలిన ఇసుక, ప్రమాణాలకు అందని సిమెంట్. వీటికి తోడు అప్పుడప్పుడు చేసిన వాటర్ క్యూరింగ్, ఆపై ఆర్‌అండ్‌బీ అధికారుల అండదండలు. ఇలా చేపట్టే రోడ్లు ఎలా ఉంటాయి. అచ్చం ఏజెన్సీలో చేపట్టే రోడ్లలా ఉంటాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో నాణ్యత నేతి బీర చందమవుతోంది. రూ.కోట్ల నిధులు కాంట్రాక్టర్ల పాలవుతున్నాయి. ఫలితంగా పది కాలాలు ఉండాల్సిన రోడ్ పగుళ్లు తేలుతూ, ఎక్కడి అక్కడ రాళ్లు తేలి కనిపిస్తోంది. చర్ల మండలం పాత చర్ల నుంచి పూజారిగూడెం గ్రామం వరకు గతంలో సీసీ రోడ్ నిర్మాణం ఉంది. ఆ రోడ్ ఎక్కడా పగుళ్లు కానీ, గుంతలు కానీ ఏమాత్రం పడలేదు. ఇంకా ఆ రోడ్‌పై సుమారు 5 ఏళ్ల వరకు రాకపోకలు సాగించవచ్చు. అయినప్పటికీ మళ్లీ అదే రోడ్‌పై సీసీ రోడ్ నిర్మాణానికి ప్రభుత్వం కోటి నిధులు మంజూరు చేసింది. అధికారులు తప్పుడు నివేదికలు పంపడమే ఇందుకు కారణం. కాగా ఈ పనులను ఆర్‌అండ్‌బీ శాఖ పర్యవేక్షణ చేస్తోంది.

**రాళ్లు తేలిన రోడ్**

కోటి రూపాయల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ జనవరిలో పనులు ప్రారంభించి అదే నెల 13న పనులు పూర్తి చేశాడు. ఈ పనులు అన్నీ నాసికరంగా చేశాడన్న ఆరోపణలు వస్తున్నాయి. నాసికరం ఇసుక, సిమెంట్ వినియోగించారన్న విమర్శలు ఉన్నాయి. ఫలితంగా పూజారిగూడెం చివరి నుంచి గాంధీ బొమ్మ వరకు 8చోట్ల రోడ్ పగుళ్లు తేలింది. అలాగే పాత చర్ల శివాలయం దగ్గర గాంధీబొమ్మ సెంటర్ వరకు రోడ్డు మొత్తం రాళ్లు తేలి గుంతలు కనిపిస్తున్నాయి. మరో ఐదు ఆరు నెలల్లో రోడ్డు పూర్తిగా డ్యామేజ్ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

**అసంపూర్తిగా రోడ్**

సీసీ రోడ్ పనులు మొత్తం పూర్తి కాకుండానే గుంతలు పడుతున్నాయి. గాంధీబొమ్మ విగ్రహం వద్ద అసంపూర్తిగా వదిలేశారు. దానికి తోడు సైడ్ బరమ్స్ పేరిట మొరం కాకుండా జిగురు మట్టి పోశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టి కూడా ఎగుడు దిగుడులతో అస్తవ్యస్తంగా పోసి మమ అనిపించారనే విమర్శలు వస్తున్నాయి. కాగా ఆర్‌అండ్‌బీ శాఖ పర్యవేక్షణ అంటే ప్రజల్లో ఓ నమ్మకం ఉంటుంది. పనులు నాణ్యతతో జరుగుతాయని అనుకుంటారు. కానీ చర్ల మండలంలో జరిగే పనుల తీరేవేరు. ఆర్‌అండ్‌బీ శాఖలో పని చేస్తున్న ఓ అధికారి తీరు కారణంగా పనులు నాణ్యతతో జరగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పనులు జరుగుతున్నప్పుడు ఆయన ఉపయోగించే ప్రభుత్వ ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసినా.. ఎత్తరని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్ నిర్మాణంపై గిరిజన సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. ఇదే విషయం ఆర్‌అండ్‌బీ ఈఈని ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ ఎత్తలేదు.


నాణ్యత ఉన్న రోడ్‌పై మళ్లీ సీసీ వేస్తున్న దృశ్యం

## మైనింగ్ కళాశాలను సందర్శించిన కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి


కళాశాలలో వసతులను పరిశీలిస్తున్న వీసీ

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ పరిసర ప్రాంతాలను కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కే.ప్రతాప్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మైనింగ్ కళాశాలలోని లైబ్రరీతోపాటు తరగతి గదులు, సెమినార్ హాల్, వివిధ అంతస్తుల్లోని గదులను, కళాశాల పరిసరాలను పరిశీలించారు. తరగతి గదుల్లో ఉన్న విద్యార్థులు, అధ్యాపకులతో ఆయన మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా రూపాంతరం చెందనున్న తరుణంలో కళాశాలలో బుధవారం నిర్వహిస్తున్న వార్షికోత్సవ వేడుకలకు విచ్చేశారని మైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టీ.జగన్‌మోహన్‌రాజు తెలిపారు.

## ఇంటర్నేషనల్ గేమ్స్ మీట్‌లో భద్రాద్రి క్రీడాకారుడి ప్రతిభ

**ఆరు బంగారు పతకాలు సాధించిన రామ్మోహన్‌రావు**

భద్రాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో ఈ నెల 2 నుంచి 8వరకు నిర్వహించిన ఇంటర్నేషనల్ గేమ్స్ మీట్‌లో భద్రాచలానికి చెందిన క్రీడాకారుడు గాలి రామ్మోహన్‌రావు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహించారు. పవర్ లిఫ్టింగ్, 5కే రన్, 10కే వాక్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. ఏజెన్సీనుంచి అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో రాణించిన రామ్మోహన్‌రావును సహచర క్రీడాకారులు, మిత్రులు అభినందించారు.

## ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలి

» బినామీ కాంట్రాక్టర్లను రద్దు చేయాలి
» సీఎంకు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కెచ్చల రంగారెడ్డి బహిరంగ లేఖ

భద్రాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో పొక్లయినర్లతో ఇసుక అక్రమ తరలింపు అరికట్టాలని, ఇసుక వెలికితీత ప్రభుత్వమే చేపట్టాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కెచ్చెల రంగారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి వారు బహిరంగలేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం పత్రికలకు విడుదల చేశారు. ఏజెన్సీలో బినామీ కాంట్రాక్టర్ల వ్యవస్థ రద్దు చేయాలని, పెసా చట్టం పకడ్బందీగా అమలు చేయాలని సీఎంను ఆ లేఖలో కోరారు. ముఖ్యంగా చర్ల మండలం సి.కత్తిగూడెంలో నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్‌కు అనుమతులు ఉన్నాయనే సాకుతో పొక్లయినర్లతో చేపడుతున్న ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇసుకతో పాటు ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు అక్రమ తరలింపులపై ఉక్కుపాదం మోపాలని కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమని ప్రభుత్వానికి ఆదాయం పెంచవచ్చని సీఎం ఇటీవల గనుల శాఖ సమీక్ష సమావేశంలో ఆదేశించడం శుభపరిణామం అన్నారు.

## ఈదురుగాలులు, భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్‌పట్ల జాగ్రత్త వహించాలి

**ఎస్ఈ మహేందర్**

కొత్తగూడెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులు, భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్‌పట్ల జాగ్రత్త వహించాని భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీరు జీ.మహేందర్ బుధవారం తెలిపారు. వర్షాలు కురుస్తున్నప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాలను, స్టేవైరు, సపోర్టు వైరును, విద్యుత్ ఉపకరణాలను తాకరాదన్నారు. తెగిపడిన, వేలాడుతున్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదని, గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలియచేయాలని ఆయన తెలిపారు. దుస్తులు ఆరవేసే జీఐ దండెము వైర్లపై నుంచి విద్యుత్ వైర్లు వెళ్లడం వల్ల విద్యుత్‌వైర్లలో ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడం వల్ల దండేలకు విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురయ్యే ప్రమా దం ఉందని, ప్లాస్టిక్ వైర్లకు దండేలకు ఉపయోగించాలన్నారు. రైతు సోదరులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం, వ్యవసాయ పంపుసెట్లను వినియోగించినపుడు కరెంట్ మోటా ర్లు, ఫుట్‌వాల్వ్‌లు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ విద్యుత్ ప్రసాదం జరిగి ప్రమాదాలు జరుగుతున్నాయని, కరెంట్ మోటార్లను కానీ పైపులనుకానీ ఫుట్ వాల్వ్‌లను తాకకూడదని, వ్యవసా య పంపుసెట్లను, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి. విద్యుత్ ప్రమాదాలు ఎర్త్ లేని పరికరాల వల్లే జరుగుతాయి. ఎర్త్ లేని మోటార్లు స్టాటర్లు, జీపీ పైపులు, ఫుట్ వాల్వ్‌లు అత్యంత ప్రమాదకరం. ఎర్తింగ్ అనేది చాలా సులభంగా చేసుకోవచ్చు. రైతులు వినియోగదారులు స్వయంగా తమ సొంత కరెంట్ పనులను చేసుకోకూడదని అర్హత కలిగిన ఎలక్ట్రిషన్‌తో పనులుచేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పశువులను యజమానులు మేతకు తీసుకు వెళ్లినప్పుడు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల దగ్గరికి వెళ్లకుండ జాగ్రత్త వహించాలని కోరారు. ఇంట్లో నాణ్యమైన విద్యుత్ పరికరాలు (ఐఎస్ఐ) వాడాలన్నారు. గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బంది లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజనీరు సెక్షన్ ఆఫీసర్‌ను సంప్రదించి వారి సేవలను పొందాలని పిలుపునిచ్చారు. విద్యుత్ అంతరాయానికి సంబంధించిన సమస్యలు ఉంటే ప్రజలు వాటి పరిష్కారం కోసం విద్యుత్‌శాఖ టోల్ ఫ్రీ నెం: 1912కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచండి

**సీఎండీకి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ విజ్ఞప్తి**

కొత్తగూడెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం నాయక్‌కి సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టీజేఎస్ నాయకులు, ఎమ్మెల్సీ కోదండరాం, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ సమక్షంలో బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్.బలరాంని కలిసి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, ఇతర సమస్యలపై చర్చించారు. కోదండరాం, జనక్ ప్రసాద్ మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు అనేక సంవత్సరాలుగా అన్యాయం జరుగుతోందని, ఆ అన్యాయాన్ని సరిచేయాలని సీఎండీని కోరారు. సీఎండీ మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులు శ్రమ ఉందని వారి జీతాలను పెంచడానికి సింగరేణి యాజమాన్యం కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రస్తుతం జీవో ప్రకారం వేతనాన్ని చెల్లిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం నూతన జీవో ఇచ్చి వెంటనే దానిని అమలు చేస్తామన్నారు. కోదండరాం, జనక్ ప్రసాద్‌లు జోక్యం చేసుకుని రాష్ట్రంలోని ఎన్టీపీసీ, ఐటీసీలతో సహా అనేక ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పరిశ్రమల్లో జీవోలకు అదనంగా రూ.3వేల నుంచి రూ.5వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారని, కోల్ ఇండియాలో కూడా జీవోకు అదనంగా రోజుకు రూ.724లు చెల్లిస్తున్నారని, కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుదల విషయంలో సింగరేణి సానుకూలంగా ఉందని, సింగరేణిలో కూడా జీవోకి అదనంగా వేతనాలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి సీఎండీ స్పందిస్తూ జీవోకు అదనంగా వేతనాలు చెల్లించే విషయమై అధ్యయనం చేయించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికు వేతనాలు పెంపుదల కోసం చర్చించిన ఎమ్మెల్సీ కోదండరాం, జనక్ ప్రసాద్‌కు, సింగరేణి సీఎండీకి జేఏసీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధి బృందంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ.మధు, కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాసూరి శంకర్, సింగరేణి ప్రగతిశీల కాంట్రాక్టు కార్మిక సంఘం (టీయూసీఐ) రాష్ట్ర నాయకులు ఆర్.మధుసూదన్‌రెడ్డి, టీజేఎస్ నాయకులు వి.బాబు, మల్లెల రామనాథం తదితరులు పాల్గొన్నారు.


సింగరేణి సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

# ఎత్తిపోతలు.. ఉత్త కోతలు

(3వ పేజీ తరువాయి)

అవసరమైన నిధుల సేకరణ సక్రమంగా జరగకపోవడంతో అనేక ఎత్తిపోతల పథకాలు మూలనపడ్డాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 135 వరకు ఎత్తిపోతల పథకాలుండగా కొన్ని నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. 50కి పైగా లిఫ్టులు పనిచేస్తున్నాయని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు.

జిల్లాలో లిఫ్టులు మరమ్మతులు చేయాలంటే రూ.20 నుంచి రూ.30 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయి. ఖమ్మం జిల్లాలో ఒక్క నేలకొండపల్లి మండలంలో మాత్రమే రైతులు ఆదర్శంగా లిఫ్టులను నిర్వహిస్తున్నారు. ఐడీసీ, ఎన్ఎస్‌పీ, ఐటీడీఏ, ఎస్సీ కార్పొరేషన్ తదితర శాఖల ద్వారా నిర్మితమైన అన్ని ఎత్తిపోతల పథకాలను ప్రత్యేకంగా అధికారుల బృందంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి మర్మతులకు అవసరమైన నివేదికలు సిద్ధం చేస్తే జిల్లాలో లిఫ్టుల పరిస్థితి మెరుగవుతుంది. ఇకనైనా పాలకులు ఎత్తిపోతల పథకాలపై దృష్టి సారించి వాటి మరమ్మతులకు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**మధిర నియోజకవర్గంలో....**

మధిర టౌన్ (ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలో ఉన్న మూడు ఏర్లతో పాటు పలు వాగలపై నిర్మించిన పలు ఎత్తిపోతల పథకాలు అనేక ఏళ్లుగా పనిచేయక నిరుపయోగంగా ఉన్నాయి. మధిర మండలంలో 17 లిఫ్టులకు గాను ఐదు లిఫ్టులు మాత్రమే పని చేస్తుండగా మరో ఐదు లిఫ్టులను పూర్తిగా మూసివేయగా మరో ఐదు లిఫ్టుల మరమ్మత్తులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. బోనకల్ మండలంలో 11 ఎత్తిపోతల పథకాలకు ఐదు మాత్రమే పని చేస్తున్నాయి, చింతకాని మండలంలో నాలుగు ఎత్తిపోతల పథకాలకు గాను రెండు పనిచేస్తుండగా మరో రెండు మూతపడ్డాయి. ముదిగొండ మండలంలో మున్నేరుపై ఉన్న ఐదు లిఫ్టులు ఇటీవల వరదలకు పూర్తిగా దెబ్బతిన్నాయి.

**భద్రాద్రి నియోజకవర్గంలో...**

భద్రాచలం (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎత్తి పోతల పథకాలు మూలనపడ్డాయి. దుమ్ముగూడెం మండలంలో 13 ఎత్తి పోతల పథకాలుండగా కేవలం గుర్రాలబైలు ఒక్కటే పని చేస్తోంది. బండారిగూడెం ఎత్తిపోతల పథకం గోదావరి వరదలకు పాడైపోయి ఏడేళ్లుగా పని చేయడం లేదు. మిగతావి ఏళ్ల తరబడి మూలనపడి ఉన్నాయి. చర్ల మండలంలోని పూసుగుప్ప ఎత్తిపోతల పతకం పని చేయడం లేదు. మోటార్లు పని చేయక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. వాజేడు మండలంలో పూసూరు ఎత్తి పోతల పథకం పని చేయకపోవడంతో 700 ఎకరాలకు సాగునీరు అందడం లేదు. గుమ్మడిదొడ్డిలో ఉన్న ఎత్తిపోతల పథకం దశాబ్దకాలంగా పని చేయడం లేదు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

(3వ పేజీ తరువాయి)

కొనుగోలు కేంద్రం జిల్లాలోనే పెద్దది. ఇక్కడ కేంద్రం ప్రారంభించి వారం రోజులు గడిచినా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా జరగని పరిస్థితి. మండలంలో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరు కాగా వాటిలో 28 కేంద్రాలు ప్రారంభించారు, ఇక రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు గాను తగిన విధంగా మిల్లులను కేటాయించని పరిస్థితి. ఒక్క పుల్లయ్యబంజర కేంద్రానికి మాత్రమే మిలుల్లను కేటాయించారు. సదరు మిల్లర్ మాత్రం ఇంత వరకు కేంద్రాల వద్దకు వచ్చి ధాన్యం శ్యాంపిల్స్‌ను పరిశీలించలేదని రైతులు చెబుతున్నారు. మిగిలిన కేంద్రాల్లో ఇంత వరకు గింజ ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని తెలిసింది. ఆయా కేంద్రాల్లో ధాన్యం రాశులు అరబెట్టి కొనుగోలు కోసం రాశుల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. ఇక గన్నీ సంచులు కూడా అంతంత మాత్రమే అందించారు.

**అకాల వర్షాలతో పొంచి ఉన్న నష్టం...**

గత వారం రోజుల నుంచి దశలో వారీగా అకాల వర్షాలు, ఈదురు గాలులతో వరి పంట పండించిన రైతులకు తీవ్రంగా నష్టం జరిగింది. ఇప్పటికే మండలంలోని పక్వానికి వచ్చి కోతకు సిద్దంగా ఉన్న 7 వేలకు పైగా ఎకరాల్లో వరి పూర్తిగా నేల వాలింది. దీంతో వరి కోతల యంత్రాల కిరాయి రైతులకు ఆర్థిక భారంగా మారనున్నది. ఈ యాసంగిలో ప్రకృతి బీభత్సానికి రైతులు తీవ్రంగా నష్టం పోవాల్సిన పరిస్థితి దాపురించింది. జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి రైస్ మిల్లర్లను సమన్వయం చేస్తూ, గన్ని సంచులు అందుబాటులో ఉంచి కొనుగోలు ప్రక్రియను వేగం జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరపాలి...**


**పెద్దబోయిన నారాయణరావు రైతు, పుల్లయ్యబంజర**

కల్లూరు మండలంలో ధాన్యం కేంద్రాలు ప్రారంభించారే కానీ సరియైన వి. దంగా మిల్లర్లను కేటాయించలేదు. గన్ని సంచులు అరకొరగా అందించారు. ఒక్క పుల్లయ్యబంజర కొనుగోలు కేంద్రంలోనే లక్ష బస్తాలు అవసరం కాగా, కేవవలం 25 వేల బస్తాలు అందించారు. దీంతో రైతులు గన్ని సంచుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. మిల్లర్లు ఇంతవరకు ముందుకు రాని పరిస్థితి. అసలే అకాల వర్షాలు, ఈదురు గాలులతో రైతులు త్రీవంగా నష్టాపోతున్నారు. రైతులకు మద్దతు ధర అం దేలా సత్వరమే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వేగం జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలి.

# కనుల పండువగా తెప్పోత్సవం

**సంప్రదాయబద్ధంగా దొంగల దోపోత్సవం**

భద్రాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీసీతారామచంద్ర స్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ రాముడికి బుధవారం తెప్పోత్సవం నిర్వహించారు. సీతారాముల కల్యాణం జరిగిన 4వ రోజున పవిత్ర గోదావరిలో కల్యాణ రామునికి తెప్పోత్సవం నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దొంగలదోపు ఉత్సవం సంప్రదాయబద్ధంగా సాగింది. రాత్రి స్వామి వారికి దొంగల దోపోత్సవాన్ని నిర్వహించగా వేలాది మంది భక్తులు ఆహ్లాదకరంగా తిలకించారు. ఈ సమయంలో పరకాలుడు వేషధారి శంకుచక్రాలు, గొడుగు చోరీ చేయగా వాటిని భటులు స్వాధీనం చేసుకొని స్వామి వారి ముందు నిందితుడిని ప్రవేశపెడతారు. ఈ సమయంలో నిందితుడు తప్పు ఒప్పుకొని స్వామి వారిని క్షమించమని కోరతాడు. ఈ క్రమంలో పెరయ తిరుముడిలోని తొలి పది పాశురాలను అనుసంధానం చేసి పరకాలుడు వేషధారుడికి, భటులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గురువారం భద్రాద్రి రామయ్యకు ఊంజల్ సేవ నిర్వహిస్తారు.


పరకాలుడి వేషాదారున్ని పట్టుకున్న సన్నివేశం

# రుణమాఫీ నూరుశాతం అమలు చేయాలి

» టీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతుల్ని నమ్మించి మోసం చేసిన ప్రభుత్వాలు కేంద్రం, రాష్ట్రంలో ఎక్కువ కాలం మనుగడ సాధించలేదని అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోను కాంగ్రెస్ ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేయాలని లేకుంటే రైతుల ఆగ్రహం కాంగ్రెస్ తెలుసుకొనే రోజులు సమీపంలోనే ఉన్నాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం ఖమ్మంలో రైతులతో కలిసి నాయకులు భారీ ర్యాలీ చేపట్టారు. వీవీ పాలెం నుంచి కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు గంటల పాటు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ భేషరుతుగా రైతు రుణమాఫీ రూ.2లక్షలు అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కొర్రిలు పెట్టిందని విమర్శించారు. సగం మంది రైతులకు రుణమాఫీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా తక్షణం అమలు చేయాలని సమగ్ర బీమా పథకాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, వడగండ్ల వర్షాలకు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు దండి రమేశ్, కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరునే కాంగ్రెస్ అమలు చేస్తోందని విమర్శించారు. నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపుడి రవి, ఏపూరి రవీంద్రబాబు, జక్కుల రామారావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బాగం ప్రసాద్, బానోత్ రామ్‌కోటి, పాసంగుల చందర్‌రావు, ఏలూరి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

# రైతాంగానికి ప్రత్యేక బడ్జెట్ అవసరం: ఏఐకేఎస్

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కారించాలంటూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రైతాంగానికి పాలక ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, పంటలకు మద్దతు ధర నిర్ణయించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలు ఉపసంహరించాలని, రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలని, క్వింటాల్ మిర్చి పంటకు రూ.25వేలు, పత్తి పంటకు రూ.16వేలు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడిన ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం.. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం నేటివరకు చేసిన ప్రయత్నాలేవి సగటు రైతు ఆదాయం పెంచేందుకు అనుకున్న లక్ష్యానికి దరిదాపుల్లో కూ డా లేవన్నారు. పాలకుల రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్న నల్లచట్టాలను తక్షణమే రద్దు చేయాలని, దేశీయ సంస్థలను కార్పొరేట్లకు హస్తగతం చేశారని ఆరోపించారు. రైతులకు అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం అడుగుజాడల్లో రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. రైతులకు సాగునీరు, సబ్సిడీపై యంత్రాలు, పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్, నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, నారాటి రమేష్, సపవట్ రవి, విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, సీతారాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన నేషనల్ హైవే పనులు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) :జాతీయరహదారుల పనులు ఎలాంటి అడ్డంకులు లేకుండా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డిలతో కలిసి నేషనల్ హైవే, మున్నేరు రిటైనింగ్ వాల్, కిష్టారం గ్రామ సమస్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, నేషనల్ హైవే ప్రాజెక్టుల పూర్తికి కావాల్సిన భూసేకరణ త్వరితగతిన పూర్తి చే యాలన్నారు. ప్రాజెక్టుల వారిగా సమస్యలు, పెండింగ్ భూసేకరణ, పనుల అడ్డగింత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం ప్రభుత్వ భూమి, ప్రయివేటు భూ యజమానులు భూసేకరణకు అంగీకరించిన చోట పనులు చేపట్టి వేగంగా పూర్తిచేయాలన్నారు. సింగరేణి ప్రభావిత కిష్టారం గ్రామ సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఎస్డీసి రాజేశ్వరి, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, నేషనల్ హైవే పీడీ రామాంజనేయరెడ్డి, సింగరేణి జీఎం షాలం రాజు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో దొంగల బీభత్సం

(3వ పేజీ తరువాయి)

నిర్ధారణ అయింది. జీ.రాజశేఖర్ ఇంట్లో 400 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి, సుక్రు ఇంట్లో రూ.లక్ష నగదుతో పాటు 60 గ్రాముల బంగారం, సుందర్ ఇంట్లో 100 గ్రాముల బంగారం, పొట్టి కిరణ్ ఇంట్లో 60 గ్రాముల బంగారం, 100గ్రాముల వెండి, విజయకుమార్ ఇంట్లో 20 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి, రామస్వామి ఇంట్లో విలువైన వస్తువులతోపాటు మరో ఇద్దరి ఇళ్లలో ఏమేమీ చోరీ జరగాయో విదేశాల్లో ఉన్న వారు వస్తేనే పూర్తి వివరాలు తెలుస్తాయి. సరైన సెక్యూరిటీ లేనికారణంగా క్వార్టర్స్‌లో తరచూ ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయని, రెండేళ్ల నుంచి ఇదే విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గుర్తింపు సంఘ బాధ్యులు సముద్రాల సుధాకర్, భీమయ్య, భరణి, నరసింహారావు, బరిగల శేఖర్, బుగ్గ సుధాకర్, రొంటాల సురేష్, తిరుపతి, రాంచందర్, వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

# యర్రా శ్రీకాంత్‌కు రెడ్‌సెల్యూట్

(3వ పేజీ తరువాయి)

సంతాప సభలో అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అఖిల భారత మహాసభల్లో శ్రీకాంత్‌తో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా శ్రీకాంత్‌తో తనకు ఉద్యమ సంబంధాలు ఉన్నాయని తెలిపారు. కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... యర్రా కుటుంబం అంటే ఖమ్మంలో సీపీఎం అని గుర్తుకొచ్చేలా పనిచేశారన్నారు. శ్రీకాంత్ లాంటి పోరాటయోధుడి మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. మతోన్మాదంపై జరిగిన తీర్మానంలో శ్రీకాంత్ పాల్గొన్నారని తమ్మినేని వివరించారు.

రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల కోసం శ్రీకాంత్ పనిచేశారన్నారు. గంటల వ్యవధిలోనే తమ కళ్ల ముందే మరణించటం ఆందోళన కలిగించిందన్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ సీపీఎం మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. శ్రీకాంత్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కేంద్ర కమిటీ సభ్యులు ఎం.సాయిబాబు, బీ.వెంకట్, వై.వెంకటేశ్వరరావు, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, బాగం హేమంతరావు, పాలడుగు భాస్కర్, బండి రమేష్, బండి పద్మ, ఆవులూరి మధు, వై.విక్రమ్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు

# మధిర నియోజకవర్గానికి జాతీయ రహదారుల కళ

- పూర్తైన కోదాడ- ఖమ్మం జాతీయ రహదారి
- ముమ్మరంగా సూర్యాపేట- దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు
- ప్రారంభమైన నాగపూర్- అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు



బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి వద్ద జరుగుతున్న నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

మధిరటౌన్, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకు ఒక్క కిలోమీటరు కూడా జాతీయ రహదారి లేని మధిర నియోజకవర్గంలో మరికొన్ని నెలల్లో దాదాపు 70 కిలోమీటర్ల నిడివితో ఏకంగా మూడు జాతీయ రహదారులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో దక్షిణ భారతదేశం నుంచి ఉత్తర భారతదేశానికి ఎవరు వెళ్లాలన్నా మధిర నియోజకవర్గం గుండా వెళ్లక తప్పదు. మూడు జాతీయ రహదారుల్లో కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి పూర్తయి రాకపోకలు కూడా సాగుతున్నాయి. ఈ రహదారి ముదిగొండ మండలంలో నాలుగు గ్రామాల మీదుగా 12కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. సూర్యాపేట-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే చింతకాని మండలంలో 11కిలోమీటర్ల మేర మూడు గ్రామాల గుండా వెళుతుంది, అలాగే నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే కూడా చింతకాని మండలంలో 10 కిలోమీటర్ల మేర నాలుగు గ్రామాల గుండా వెళుతుంది. చింతకాని మండలంలోని కొదుమూరులో అటు సూర్యాపేట-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఇటు నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే కూడా ఒకదాని పై నుంచి ఒకటి వెళుతుంది. ఇక్కడ ఒక హైవే నుంచి మరొక హైవే మీదకు వెళ్లేందుకు రెండు జాతీయ రహదారులకు ఇంటర్‌చేంజ్ పాయింట్లు ఇచ్చారు. దీంతో రెండు జాతీయ రహదారులు కలిగిన గ్రామంగా కొదుమూరు చరిత్రను సంతరించుకోనుంది. నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే బోనకల్ మండలంలో మూడు గ్రామాల మీదుగా 14 కిలోమీటర్లు, మధిర మండలంలో ఐదు గ్రామాల్లో 15 కిలోమీటర్లు, ఎర్రుపాలెం మండలంలో 9గ్రామల గుండా 16 కిలోమీటర్లు ప్రయాణించనుంది.

### రైతులకు శాపంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే...

మధిర నియోజకవర్గంలో నిర్మిస్తున్న సూర్యాపేట-దేవరపల్లి, అమరావతి-నాగపూర్ హైవేలు గ్రీన్‌ఫీల్డ్ హైవేలుగా నిర్మిస్తుండటంతో వీటిరి సర్వీస్ రోడ్లు నిర్మాణం లేకపోవడంతో భూమి ఇచ్చిన రైతులు తమ వ్యవసాయ పనులకు హైవే దాటి వెళ్లాలంటే ఎక్కడో అండర్ పాస్ ఇచ్చిన దగ్గరకు వెళ్లి రావాల్సి ఉండటంతో వారు సాగు పనులకు వెళ్లాలంటే యాతనకు గురి అవ్వాల్సి వస్తుంది. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు తమ విలువైన భూములు ఇవ్వమని, సర్వీస్ రోడ్లు లేకపోతే వ్యవసాయ పనులకు వెళ్లాలంటే కష్టమని రైతులకు ఆందోళనకు దిగిన సమయంలో నాయకులు సాగుకు ఇబ్బందులు లేకుండా సర్వీస్ రోడ్లు మంజూరు చేయిస్తామని ఒప్పించారని, ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

### ఖమ్మం-విజయవాడ మార్గంలో తగ్గనున్న దూరం

ఇంతకు ముందు ఖమ్మం నుంచి విజయవాడ వెళ్లాలంటే 120కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. అదే నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి వస్తే ఖమ్మం విజయవాడ మధ్య 30కిలోమీటర్ల దూరం తగ్గనుండటంతో పాటు ఇది ఎక్స్‌ప్రెస్ హైవే కావడంతో దాదాపు గంటన్నర సమయం కలిసిరానుంది. ఖమ్మం-విజయవాడ మధ్య నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేని 90కిలోమీటర్ల పొడవుతో నిర్మిస్తుండగా ఈ హైవే విజయవాడ దగ్గరలో కొత్తగా నిర్మించిన విజయవాడ పశ్చిమ బైపాస్ ను జక్కంపుడి వద్ద కలవనుంది. నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నుంచి వచ్చే వాహనాలు ఈ బైపాస్ గుండా ఉత్తరం వైపు ప్రయాణిస్తే గన్నవరం విమానాశ్రయం తో పాటు కోలకత జాతీయ రహదారిని కలవనుంది, ఇటు దక్షిణం వైపు వెళితే ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి మీదగా గుంటూరు సమీపంలోని ఖాజా టోల్‌గేట్ వద్ద చెన్నై జాతీయ రహదారిని కలవనుంది. ఈ హైవేలన్నీ గ్రీన్‌ఫీల్డ్ హైవేలు గా నిర్మిస్తుండటంతో ఎక్కడా గ్రామం తాకకుం డా ఆ గ్రామ రెవెన్యూ లోని పొలాల గుండా పోతున్నాయి.

### రూ.26 లక్షలే ఇచ్చారు.....



● దొబ్బల వెంగళరావు, రాఘవాపురం, చింతకాని మండలం

సూర్యాపేట-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద మా కుటంబానికి ఉన్న 14 ఎకరాలలో నాలుగు ఎకరాలు భూమి పోయింది. మా గ్రామం ఖమ్మానికి సమీపంలో ఉంది. ఇక్కడ ఎకరం కోటిన్నరకు పైనే ఉంది, కానీ మాకు ప్రభుత్వం ఎకరాకు రూ.26 లక్షలే పరిహారంగా ఇచ్చారు. హైవే మా భూమి మధ్యగుండా పోవడంతో పొలం రెండు ముక్కలు అయ్యింది, సర్వీసు రోడ్లు లేక పోవడంతో భూమి ఇచ్చి రెండు విధాల నష్టపోయాం.

### సర్వీస్ రోడ్లు ఇవ్వాలి...



● వెలగపుడి హనుమంతరావు, ఆత్కూరు, మధిర మండలం

భూమి మధ్య కుండా హైవే పోవడంతో వ్యవసాయ పనుల నిమిత్తం అవతల వైపు ఉన్న భూమికి పోవాలంటే ఇబ్బందులు తలెత్తనున్నాయి, సర్వీసు రోడ్డు ఉంటే ఎక్కడో ఓ చోట ఉన్న అండర్ పాస్ నుంచి అవతల వైపు ఉన్న భూముల్లోకి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్ల వచ్చు.

# సార్ మళ్లీ వస్తారా...?

» సెలవులో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ » నెల రోజులకు పైగా తెరుచుకోని కార్యాలయం



నెల రోజులకు పైగా తెరుచుకోని పీడీ కార్యాలయం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లోని పట్టణ పేదరిక నిర్మూలన విభాగం(మెప్మా)లను పర్యవేక్షించాల్సిన ప్రాజెక్టు డైరెక్టర్ గత నెల రోజులకు పైగా సెలవుపై వెళ్లడంతో జిల్లా వ్యాప్తంగా మెప్మాపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాజీవ్ యువ వికాసం, నూతన మహిళా సంఘాలు ఏర్పాటు, మహిళా శక్తి యూనిట్లు ఏర్పాటు, పట్టణాల్లో ఇందిరమ్మ సర్వేతో పాటుగా ఇటీవల కాలంలో ఏర్పడిన నూతన మునిసిపాలిటీలకు మెప్మా ఉద్యోగుల కేటాయింపు వరకు ఎంతో ప్రభావం పడుతోంది. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సెలవుపై వెళ్లడంతో తర్వాత స్థాయిలోని వారు తీసుకునే నిర్ణయాలు మెప్మాలో గందరగోళానికి దారి తీస్తున్నాయి. అందుకే మెప్మాలోని ఉద్యోగుల నుంచి ఆర్పీల వరకు సార్ మళ్లీ వస్తారా.. అంటూ ఎదురు చూస్తున్నారు..

ఖమ్మం జిల్లా మెప్మా ప్రాజెక్టు అధికారిగా వచ్చిన అధికారి గత ప్రభుత్వంలో రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్‌కు వ్యక్తిగత ఓఎస్‌డీగా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ కొన్ని నిర్ణయాల్లో కీలకంగా పనిచేశారని సమాచారం. ప్రభుత్వం మారడంతో అనూహ్యంగా ఖమ్మం జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆగస్టు నెలలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తర్వాత జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలను పర్యవేక్షణ చేశారు. కొన్ని విధానపరమైన మంచి నిర్ణయాలు సైతం తీసుకున్నారు. కాగా ఫిబ్రవరి మాసం నెలలో వ్యక్తిగత సెలవ్‌పై వెళ్తి స్థానిక సంస్థల జిల్లా అధికారికి ఇన్‌చార్జీ బాధ్యతలను అప్పగించారు. నెల రోజులు పూర్తి జరిగిన తిరిగి కార్యాలయానికి రాలేదు. వస్తారా లేదా ప్రమోషన్‌పై వెళ్తారా.. అని మెప్మాలో చర్చ జరుగుతుంది.దీంతో రాజీవ్ యువశక్తి, నూతన మహిళా సంఘాల ఏర్పాటు, ఇందిరమ్మ సర్వే, మహిళా శక్తి, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు నిర్మాణం పర్యవేక్షణపై ప్రభావం పడింది. నూతనంగా ఎదులాపురం, కలూరు మున్సిపాలిటీలు ఏర్పాటు కాగా ఆయా మున్సిపాలిటీలకు ఉద్యోగుల కేటాయింపుపై జాప్యం జరిగింది.

# నేటితో ఇస్రో ప్రస్థానం 50 ఏళ్లు పూర్తి

» కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఆంగ్లం విభాగాధిపతి మంజుల




వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న మంజుల

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఇస్రో ప్రస్థానం ప్రారంభమై నేటితో 50 ఏళ్ల పూర్తి చేసుకుందని కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఆంగ్లం విభాగాధిపతి జి.మంజుల తెలియజేశారు. బుధవారం కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్యభట్ట కృత్రిమ ఉపగ్రహంతో ప్రారంభమైన ఇస్రో ప్రస్థానం ఏప్రిల్1975న అంతరిక్షంలోకి మొద టి సారిగా ప్రవేశ పెట్టబడినట్లు గుర్తు చేశారు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థునులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు విద్యార్థినులకు అంతరిక్షం పట్ల మరింత అవగాహన, దాని చరిత్ర, అభివృద్ధి, శాస్త్రీయ జ్ఞానం పెంపొందించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. సెక్రటరీ గుండా శ్రీనివాసరావు ఆదేశానుసారం, కరెస్పాండెంట్ కె.సునీల్ కుమార్ పర్యవేక్షణలో, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా శారద అధ్యక్షతన ఇంగ్లీష విభాగం వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వ హించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అ ధ్యాపకులు డాక్టర్ నస్రీన్ బేగం, ఆశాజ్యోతి, పాల్గొన్నారు.

# జాతరకు ముస్తాబైన దేవాలయాలు



కుర్నవల్లిలో వేంకటాచలపతి ఆలయం

తల్లాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలోని అన్నారుగూడెం అంకమ్మ దేవాలయంలో అంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల జాతర, కుర్నవల్లిలోని వేంకటాచలపతి దేవాలయంలో మంగా లక్ష్మీ సమేత వేంకటాచలపతి స్వామివారి తిరు కల్యాణ మహోత్సవ వేడుకలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి.

అన్నారుగూడెంలో అంకమ్మజాతర గురువారం ప్రారంభమై 14వతేదీ వరకు ఐదురోజులపాటు జరగనున్నది. గురువారం అమ్మవార్లకు విశేష పూజలతో జాతర ప్రారంభమై అదే రోజు సాయంత్రం ఆరుగంటల నుంచి మరుసటిరోజు శుక్రవారం రాత్రి 8గంటల వరకు గ్రామపురవీధుల్లో అమ్మవార్ల మహ ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది. 12, 13,14తేదీల్లో అమ్మవార్లకు అభిషేకాలు, మూ డురోజులపాటు మహాఅన్నదాన కార్యక్రమం ఉంటుంది.

కుర్నవల్లిలోని వేంకటాచలపతిరావు స్వామి వారి దేవాలయంలో గురువారం సుప్రభాత సేవ, మంగళతోరణ కార్యక్రమాలతో తిరు కల్యాణ మహోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయి. 11వతేదీన ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సేవకాలం నివేదన, విష్ణు సహస్రనామ పారాయణం, 12న నగర సంకీర్తన, ఎదుర్కోలు ఉత్సవం, మంగాలక్ష్మీ సమేత వేంకటాచలపతి స్వామివారి తిరు కల్యాణం, మహాఅన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి.

# వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

» టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి

పెనుబల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. బుధవారం వీఎంబంజర్ హైస్కూల్లో జరిగిన టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు సెలవులెక్కువంటూ ముఖ్యమంత్రి మాట్లాడటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇతర ఉద్యోగులకు సంవత్సరానికి 30రోజులు సంపాదిత సెలవు ఇస్తారని, ఉపాధ్యాయులను వెకేషన్ డిపార్టుమెంట్‌గా ప్రకటించినందున్న సంవత్సరానికి ఆరురోజు మాత్రమే సెలవులు ఇస్తారని ఈ వాస్తవాన్ని తెలుసుకోకుండా చట్టసభల్లో ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడటం ప్రజలను తప్పుదోవ పట్టించడమే అవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చేనెల 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 2023 నుంచి పీఆర్సీ అమలుచేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పి.నాగేశ్వరరావు, పీఏఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ.నాగమల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వీవీ.రామారావు, నాయకులు జి.వీరస్వామి, కొప్పుల శ్రీనివాసరావు, ఎన్ హెచ్.ప్రసాద్, వి.తిరుపతిరావు, కె.నాగేశ్వరరావు, టి.మురళీకృష్ణ, బి.కృష్ణారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చావా రవి

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా, భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్ నెలవారీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సీసీ కెమెరాలను పరిశీలించి, పని చేస్తున్నవి, లేనిది అడిగి తెలుసుకున్నారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్.స్వామి, ఎన్నికల డీటీ అన్సారీ తదితరులున్నారు.

# నాటు తుపాకులతో అడవి జంతువుల వేట

### ముగ్గురు ఆంధ్రా యువకుల అరెస్ట్



వివరాలు తెలియజేస్తున్న రేంజర్ మురళి

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నాటు తుపాకులతో అడవి జంతువులను వేటాడేందుకు వెళుతున్న ముగ్గురు యువకులను అశ్వారావుపేట అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో రేంజర్ మురళీ వివరాలు వెల్లడించారు. ఆంధ్రాలోని ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం కామవరం గ్రామానికి చెందిన కారం రవి, కామ మంగబాబు, వంజం నవీన్ బుధవారం ఉదయం రెండు నాటు తుపాకులతో కంట్లం ప్రాంతంలో అడవి జంతువులను వేటాడేందుకు వెళుతున్నారు. అదే సమయంలో గుబ్బల మంగమ్మ ఆలయ ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న అటవీ సిబ్బందికి వేటగాళ్లు కంటపడ్డారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని అశ్వారావుపేట రేంజ్ కార్యాలయానికి తరలించారు. జంతువులను వేటాడేందుకు వెళుతున్నామని యువకులు తమ విచారణలో తేలిపారని రేంజర్ వివరించారు. ముగ్గురిని అరెస్ట్ చేసి దమ్మపేట కోర్టులో హాజరుపరుస్తామని వివరించారు. రెండు నాటు తుపాకీలను, అందులో వినియోగించే మందును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బూర్గంపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బూర్గంపాడు మండలం సారపాకలో జరిగింది. సారపాకలోని కండక్టర్స్ కాలనీకి చెందిన బ్రహ్మాచారి(60) కార్పెంటరుగా పని చేస్తున్నారు. మంగళవారం ద్విచక్ర వాహనంపై అశ్వాపురం మండలం ఎలకలగూడెం వెళ్లారు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. ఈ క్రమంలో గాంధీనగర్ కాలనీలో ఓ ఇంట్లో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు అశోక్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

బోనకల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటమర్రి రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై మధిర రైల్వే హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన షేక్ నాగూర్ బాషా(31) గత కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. కొన్ని రోజుల నుంచి గ్రామం విడిచి వెళ్లడంతో అతని గురించి పూర్తి సమాచారం కూడ తెలియదని గ్రామస్థులు చెబుతున్నారు. అవివాహితుడు కావడంతో దూరంగా ఏదో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటాడని అందరూ బావించారు. మోటమర్రి, మధిర రైల్వే స్టేషన్ల మధ్య కి.మీ నెంబర్ 528/22-24 వద్ద దిగువకు వెళ్తున్న గుర్తు తెలియని రైలు కింద పడి మృతి చెంది ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని ఆర్కే ఫౌండేషన్ డోర్నాల రామకృష్ణ, నరసింహారావు సహకారంతో మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్: కేయూ వీసీ

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, చదువుతో పాటు సమాజ విజ్ఞానంతోనే విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందుతారని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ. డాక్టర్ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఇగ్నైట్ 2కె 25 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ.. యూనివర్సిటీగా ఆవిర్భవించబోతున్న శుభసందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ దేశంలో ప్రత్యేకమైన యూనివర్సిటీ అని.. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భావితరాలకు ఆదర్శంగా ఉండేలా విద్యార్థులు తమ ప్రవర్తనను మలుచుకోవాలని, దేశానికి ఉపయోగపడే భావి భారత పౌరులుగా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, క్రమశిక్షణతో ముందు తరాలకు ఆదర్శవంతంగా ఉండాలని, గురువులకు తల్లిదండ్రులకు, యూనివర్సిటీకి, సమాజానికి మంచిపేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యే ధ్యేయంగా విద్యార్థులు తమ జీవనం సాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.జగన్మోహన్ రాజు, కళాశాల డీన్ సదానందం ఆచార్యులు, కిషోర్‌కుమార్, కన్వీనర్ డాక్టర్ రాము, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, స్పాన్సర్లు పాల్గొన్నారు.

## డబ్బు కాజేశారని ఫిర్యాదు

వైరా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తన అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని మోసపూరితంగా తన ఖాతా నుంచి డబ్బు కాజేసిన వ్యక్తిపై బాధితురాలు వైరా పోలీసులకు ఫిర్యాదు చేసింది. వైరా మునిసిపాలిటీలోని బ్రాహ్మణపల్లి అగ్రహారానికి చెందిన తేళ్లూరి నాగేంద్రమ్మ తమ బంధువైన ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని ఉమ్మడదేవరపల్లికి చెందిన వినోద్ అనే వ్యక్తి తనను మోసం చేశాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపింది. తన బ్యాంకు ఖాతా నుంచి వినోద్ రూ.4లక్షల నగదును మరో ఖాతాకు బదిలీ చేయించాడని ఫిర్యాదులో పేర్కొంది. వైరా ఎస్‌బీఐ పట్టణ బ్రాంచ్‌లో ఉన్న తన ఖాతా నుంచి మోసపూరితంగా తనతో వేలిముద్రలు వేయించి మరో ఖాతాకు ఆనగదు మొత్తాన్ని బదిలీ చేయించాడని తెలిపింది. తాను మోసపోయిన విషయం తెలిసి వినోద్‌ను నిలదీయగా సరైన సమాధానం ఇవ్వడం లేదని పేర్కొంది. కూలీపనులు చేసుకొని జీవించే తనకు వినోద్ నుంచి న్యాయం జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరింది.

## రూ.41.50లక్షల గంజాయి దహనం

తల్లాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లాలోని ఐదు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 32కేసుల్లో పట్టుబడిన రూ.41.50లక్షల విలువైన గంజాయిని బుధవారం తల్లాడ మండలం గోపాలపేటలోని ఏడబ్ల్యూఎం బర్నింగ్ ప్లాంట్‌లో కాల్చివేశారు. ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఖమ్మం, ఖమ్మం-2, సత్తుపల్లి, మధిర, నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన 83కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు కాల్చివేశారు.

## ద్విచక్ర వాహనం చోరీ... సీసీ కెమెరాలో దొంగల ఫొటోలు

నేలకొండపల్లి, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని కూసుమంచిరోడ్డులో వాసవీభవన్ సమీపంలో మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం చోరీకి గురైంది. వివరాల ప్రకారం నేలకొండపల్లికి చెందిన పిట్టల వినయ్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనం ఇంటి ముందు ఉంచాడు. ఉదయం లేచిన అనంతరం చూసే సరికి ద్విచక్రవాహనం కనపడలేదు. ద్విచక్రవాహనం చోరీకి గురైందన్న విషయాన్ని గమనించిన వినోద్ సీసీ కెమేరాలను పరిశీలించగా సీసీ కెమెరాలో రికార్డైన ఫుటేజీ ప్రకారం ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్ళినట్లుగా రికార్డైంది. అందులో ఓ వ్యక్తి హెల్మెట్ ధరించి ఉండగా, అతనితో పాటుగా ఉన్న మరో వ్యక్తి ముఖం కనపడకుండా చేతిరుమాలు కట్టుకుని, టోపీ పెట్టుకుని ఉన్నట్లుగా కనపడుతున్నది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

జూలూరుపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఓ మహిళా ఎస్సై కారుఢీకొట్టిన సంఘటనలో భార్యభర్తలకు గాయాలైన సంఘటన మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఓ మహిళా ఎస్సై కారును నడుపుకుంటూ ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళుతుండగా.. జూలూరుపాడు నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును కొమ్ముగూడెం గ్రామంలో క్రాస్ చేస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న అనంతరం కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ ప్రహరీని ఢీకొంది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై సూజాతనగర్ వైపు నుంచి వస్తున్న కరివారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన భార్యభర్తలు గుగులోత్ కోట్యా, లక్ష్మీకి గాయాలయ్యాయి. వారిని కొత్తగూడెంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఏఎస్ఐ మల్లయ్య సందర్శించి వివరాలను నమోదు చేసుకున్నారు. సదరు మహిళా ఎస్సై కొత్తగూడెంలో రిపోర్ట్ చేసేందుకు వెళుతున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది.

## మద్యం మత్తులో వృద్ధుడిని ఢీ కొట్టిన.. డీఎంహెచ్‌వో కార్ డ్రైవర్

ఖమ్మంక్రైం, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రోడ్డు పక్కన నిలుచున్న వృద్ధుడిని డీఎంహెచ్‌వో కారు డ్రైవర్ నాగరాజు ఢీకొట్టిన సంఘటన బుధవారం సాయంత్రం ఖమ్మం నగరంలో జరిగింది. ఖమ్మం డీఎంహెచ్‌వో కారు డ్రైవర్‌గా నాగరాజు కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో పనిపై కారుతో బయలుదేరాడు. ఇందిరానగర్ రామాలయం సమీపంలోకి రాగానే రోడ్డుపై నిలుచున్న రోటరీనగర్‌కు చెందిన పెద్దస్వామి(73) అనే వృద్ధుడిని అతివేగంగా ఢీ కొట్టాడు. అ తర్వాత మరో రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోనుకూడా అతివేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వాహనాలకు స్వల్పంగా డామేజ్ అయింది. వృద్ధుడికి మాత్రం కుడికాలు పైభాగం వరకు నుజ్జునుజ్జయింది. ఎడమకాలు కూడా ఫ్యాక్చర్ అయినట్టు తెలిసింది. స్థానికులు కారు డ్రైవర్‌ను ఆపగా డీఎంహెచ్‌వో కారుగా గుర్తించి డ్రైవర్‌ను పట్టుకున్నారు. దీంతో డ్రైవర్ ఫుల్లుగా మద్యం సేవించి ఉన్నది గమనించి స్థానికులు డయల్ 100కు ఫోన్‌చేసి ఫిర్యాదుచేశారు. దీంతో బ్లూకోల్టు సిబ్బంది వచ్చి కారును పక్కకు పెట్టించి గాయపడిన వృద్ధుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకని స్టేషన్‌కు తరలించారు. కాగా వృద్ధుడి కాలు పైభాగం వరకు నుజ్జునుజ్జు కావడంతో కాలు తీసేయాల్సి వస్తుందని మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు తరలించాలని కుటుంబ సభ్యులకు వైద్యులు సూచించినట్టు తెలిసింది.

## వన్య ప్రాణులకు హాని కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు: డీఎఫ్‌వో



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

కరకగూడెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న వన్య ప్రాణులకు హాని కల్గిస్తే కఠినమైన చర్యలు తప్పవని జిల్లా అటవీ శాఖ డీఎఫ్ వో కృష్ణ గౌడ్ తెలిపారు. బుధవారం మండలంలోని అనంతారం రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడ పరిస్థితులను సెక్షన్ ఆఫీసర్ గోవింద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎవరైనా వన్య ప్రాణులకు హాని చేయడం.. విద్యుత్, ఉచ్చులు వంటివి పెట్టడం జరిగితే అటవీ హక్కుల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వన్య ప్రాణులకు ఎండ తీవ్రత వలన దాహార్తి తీర్చేందుకు నీటి వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఎవరైన పోడు నరకడం, చెట్లను నరకడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో ఉన్న వసతులను పరిశీలించి సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో మణుగూరు డివిజన్ ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మొహిద్దీన్, సిబ్బంది రోజా, లక్ష్మీ నర్సు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి KHAMMAM CITY
గురువారం 10 ఏప్రిల్ 2025
● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి
ఖమ్మం సిటీ
ZONE 6




## రాజీవ్ యువ వికాసం దరఖాస్తులకు రశీదులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుదారుల సంఖ్య రోజు రోజుకు గణనీయంగా పెరగటంతో ఆ మేరకు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఏర్పాట్లు సౌకర్యాలు పెంచుతున్నారు. ఖమ్మం జిల్లాలోనే అత్యధిక జనాభాతో పాటుగా ముస్లీం, మైనార్టీలు, ఎస్సీ జనాభా అధికంగా ఉన్న ఖమ్మం జిల్లాలో రాజీవ్ యువ వికాసానికి ఆశావాహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ప్రతి రోజు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో 750 నుంచి 800 మంది వరకు దరఖాస్తులను అందిస్తున్నారు. ఈ క్రమంలో దరఖాస్తుదారుల సంఖ్యకు తగిన విదంగా కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం రెండో కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులకు రశీదులను అందిస్తున్నారు.

## నృత్యోత్సవంలో సర్వజ్ఞ విద్యార్థి ప్రతిభ




ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల శ్రీరామనవ మి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించిన నృత్యోత్సవంలో నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో 1వతరగతి చదువుతున్న ఉండీల అదితి మాన్య ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల డైరెక్టర్ నాగేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాలలో బుధవారం షీల్డు అందించి అభినందించారు. భద్రాద్రి పుణ్యక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థిని పాల్గొని ప్రతిభ చూపడం గర్వకారణమన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్


ఈద్ మిలాప్‌లో పాల్గొన్న పాఠశాల బృందం

ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి, సర్వమాన సమానత్వానికి ప్రతీక ఈద్ మిలాప్ అని న్యూ విజన్ ప్రిన్సిపాల్ ఎండీ అబాద్ అలీ అన్నారు. బుధవారం పాఠశాలలో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మతాలు, కులాలువేరైనా తామంతా ఒకటేనని తమను ఎవరు విడదీయలేరనే సందేశ ఇవ్వడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సీహెచ్ జీకే ప్రసాద్, ప్రిన్సిపాళ్లు మాధవి, మైఖేల్ పాల్గొన్నారు.

## పోలీస్ జాగిలం యామి మృతి



ఖమ్మం క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో 9 ఏళ్లుగా విశేషసేవలందించిన పోలీస్ జాగిలం యామి (ఫీమేల్‌డాగ్) అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. ఈ సందర్భంగా పోలీసు హెడ్‌క్వార్టర్‌లో పోలీసు అధికారుల, హ్యాండ్లర్ సురేష్‌తో కలిసి ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, ఏసీపీ నరసయ్య జాగిలం వద్దపుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. అనంతరం అధికార లాంచనాలతో అంతిమవీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్ మాట్లాడుతూ వీఐపీలు, వీవీఐపీలు సందర్శించినప్పుడు స్లీపర్, బాంబులు, మందుపాతరలు గుర్తించడంలో జాగిలం యామి చాకచక్యంగా వ్యవహరించేదన్నారు. 2016లో యామి హ్యాండ్లర్ సురేష్‌తోపాటు 8 నెలల పాటు ప్రత్యేకంగా ఐబీటీఏ మోయినాబాదు ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుని జిల్లాకు వచ్చిందని, అప్పటి నుంచి అనేక సేవలందించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్లు కామరాజు, శ్రీశైలం, సురేష్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

# చిత్తశుద్ధి లోపం

**కొద్ది పాటి ఫర్నిచర్ లేక ప్రారంబానికి నోచుకొని నార్త్ జోన్**

**కేఎంసీ ఉన్నత లక్ష్యానికి ఇంజనీరింగ్ తూట్లు**

**ప్రారంభం తర్వాత పట్టింపులేని వెస్ట్ జోన్ కార్యాలయం**


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నార్త్ జోన్ కార్యాలయం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత సమీపంగా అభివృద్ధి, పౌర సేవల్ని అందించేందుకు మేయర్ పునుకొల్లు నీరజ సహకారంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఖమ్మం నగరంలో జోనల్ కార్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పాత మున్సిపల్ కార్యాలయంలో వెస్ట్ జోన్ కార్యాలయం ఉగాది రోజు మేయర్, కమిషనర్‌తో కలిసి ప్రారంభించారు. కాగా వారం రోజుల క్రితమే 3వ డివిజన్‌లోని బల్లేపల్లిలో నార్త్ జోన్ కార్యాలయం ప్రారంబానికి రూపుదిద్దుకొంది. కానీ కార్యాలయం నిర్వాహణకు ఇంజనీరింగ్ అధికారులు కుర్చీలు, టేబుల్స్, ఫర్నిచర్ ఏర్పాటు చేయలేక పోయారు. కేఎంసీ పాలకవర్గం ఉన్నత లక్ష్యానికి ఇంజనీరింగ్ అధికారులు తూట్లు పొడుస్తున్నారు.

దీంతో 1 నుంచి 10 వ డివిజన్‌ల వరకు స్థానికంగా సేవలు అందించాల్సిన నార్త్ జోన్ కార్యాలయం ప్రారంబానికి నోచుకోవటం లేదు. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వీడి ఫర్నిచర్ ఏర్పాటు చేస్తే ఖమ్మం నగరంలో విలీనమైన పది డివిజన్‌ల ప్రజలకు నార్త్ జోన్ కార్యాలయం నుంచి సేవలు అందనున్నాయి.

### కళ కోల్పోయిన వెస్ట్ జోన్ కార్యాలయం

ఉగాది పర్వదినోత్సవం సందర్భంగా ఉన్నత లక్ష్యంతో వెస్ట్ జోన్‌ను ప్రారంభించారు. తర్వాత అక్కడ అటెండర్‌ను కూడా కేటాయించ లేదు. దీంతో పది రోజులుగా కార్యాలయం తలుపులు తీయలేదు. ఇటీవల వచ్చిన గాలి దుమారానికి కార్యాలయం బోర్డు లేచి పోయింది. కనీసం కార్యాలయం ఊడ్చే సిబ్బంది లేక పోవటంతో వెస్ట్ జోన్ కళ తప్పింది.

ఈ విషయంపై ఇంజనీరింగ్ అధికారులను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఫర్నిచర్ లేక పోవటంతో నార్త్ జోన్ కార్యాలయం ప్రారంబానికి జాప్యం జరిగిందన్నారు.


పట్టింపు లేని వెస్ట్ జోన్ కార్యాలయం

# ఆడ పిల్లలు ఆత్మీయ కానుక

**ఆడపిల్ల జన్మించిన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి స్వీట్ బాక్స్ అందించిన కలెక్టర్**

**సన్నబియ్యం లబ్ధిదారురాలి ఇంట్లో భోజనం**

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): "ఆడపిల్ల పుట్టడం తల్లిదండ్రులకు భగవంతుడు ఇచ్చిన ఆత్మీయ కానుక.. అందుకే ఆడపిల్లలను ఆప్యాయంగా... అభిమానంగా చూసుకుందాం...!" అని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మా పాప - మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఖమ్మం పట్టణంలోని సారధి నగర్‌లో మౌనిక - సురేష్ దంపతులకు మార్చి 1న ఆడపిల్ల జన్మించింది. ఈ సందర్భంగా బుధవారం ఆ కుటుంబానికి జిల్లా కలెక్టర్ స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, దుస్తులు తీసుకొచ్చి వారిని అభినందించారు. తల్లిదండ్రులకు ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. అనంతరం అత్తమామలు ఆరూరి మంగమ్మ, ఆరూరి నరసింహాలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తల్లిదండ్రులకు భగవంతుడు ఇచ్చిన ఆత్మీయ కానుక ఆడపిల్ల అని, ఆడపిల్ల పుడితే భారంగా భావించకుండా అదృష్టంగా భావించాలని కోరారు. అమ్మాయి ఆశించిన మేరకు చదువుకున్న తర్వాత ఉద్యోగం లేదా వ్యాపారంలో స్థిరపడి సొంత ఆదాయ వనరులు సంపాదించుకున్న తర్వాత పెళ్ళి గురించి ఆలోచించాలని, ఆడపిల్లల మనోభావాలకు గౌరవం ఇవ్వాలని తెలిపారు. ప్రతి ఆడపిల్లను ఉన్నత చదువులు చదివించాలని, కుటుంబానికి గొప్ప పేరు తీసుకుని వస్తుందన్నారు. మౌనిక - సురేష్ దంపతుల కోరిక మేరకు పెద్ద పాప రితికకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అక్షరాభ్యాసం గావించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి సన్న బియ్యం అందిన వివరాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.రామ్ గోపాల్‌రెడ్డి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ రవికుమార్, సీడీపీవో వీరభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఆడపిల్ల ఇంటికి అదృష్టం..

నేలకొండపల్లి: ఆడపిల్ల ఇంటికి అదృష్టమని, మణిదీపమని మండల స్పెషల్ ఆఫీసర్ రవికుమార్, ఎంపీడీవో మర్రి యర్రయ్య అన్నారు. మండల పరిధిలోని సుర్దేపల్లి గ్రామంలో బుధవారం మాఇంటి మణిదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్ల పుట్టిన తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి తల్లితండ్రి మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను పెంచాలన్నారు. ఆడపిల్ల ఇంటికి లక్ష్మీదేవతన్నారు. ఆడపిల్ల పుట్టిన తల్లిదండ్రులకు స్వీట్ బాక్స్‌లు, బోకేలిచ్చి అభినందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రవికుమార్, ఎంపీడీవో యర్రయ్య, ఏసీడీపీవో, సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


సన్నబియ్యం భోజనం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

### తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం: ఆడపిల్ల పుట్టడం ఆ ఇంటికి అదృష్టమని, ఆడపిల్లలు మగపిల్లలతో సమానంగా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకు చేయూతనివ్వాలని జేడీఏ పుల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని బచ్చోడులో బుర్రా అశ్విని, నవీన్ దంపతులకు ఆడపిల్ల జన్మించింది. మా ఇంటి మణిదీపంలో భాగంగా ఆ దంపతులను ఆయన ఏవో సీతారాంరెడ్డి, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఐసీడీఎస్ అధికారులు వెళ్లి దంపతులను మిఠాయిలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ ఆడపిల్లలుపుట్టడం ఆ ఇంటికి అదృష్టంగా భావించాలన్నారు. ఆడపిల్ల పుట్టిందని బాధపడుతూ నిరాశ చెందవద్దని సూచించారు.

### ఆడపిల్లలు మన ఇంటి మహాలక్ష్మిలు

ఖమ్మం రూరల్: ఆడపిల్లలుమన ఇంటి మహలక్ష్మితో సమానం అని మండల ప్రత్యేకాధికారి జ్యోతి పేర్కొన్నారు. మండల పరిధిలోని రాజీవ్ గృహకల్పకు చెందిన నాగమణి, రవి దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు (కవలలు) జన్మించారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా బుధవారం వారి ఇంటికి వెళ్లి నాగమణి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కమల ప్రియ, సూపర్‌వైజర్లు పుష్పలత, శ్యామల పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రులపై విశ్వాసం కలిగించాలి

**సౌకర్యాల కల్పనకు చర్యలు**

**వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో కలెక్టర్ సమీక్ష**

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైద్యులు.. సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో విశ్వాసం పెంచాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లా ప్రధాన ఆసుపత్రిలో వసతులు, వైద్య కళాశాల లో సౌకర్యాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సౌకర్యాల మెరుగుపరచాలన్నారు. టాయిలెట్ల మరమ్మత్తులు, అవసరమైన కొత్త టాయిలెట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు అందించాలన్నారు. విభాగాల వారిగా కావాల్సిన సౌకర్యాల నివేదిక ఇవ్వాలన్నారు. ఓపి గదులు చిన్నవిగా ఉండడం వల్ల ఇబ్బందిగా ఉన్నట్లు, సరిపోవు విధంగా ప్రత్యామ్నాయ గదులు చూడాలన్నారు. మరో అంతస్తు, లిఫ్ట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

రేడియాలజిస్ట్, ఇతర విభాగాలకు కావాల్సిన సిబ్బందిని అవుట్ సోర్సింగ్‌పై నియామకానికి చర్యలు తీసుకోవాలన్నారు. కావాల్సిన పరికరాలు, టెస్టింగ్ కిట్స్, మందుల జాబితా సమర్పించాలన్నారు. ఎలక్ట్రిషియన్, ప్లంబర్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్యకేంద్రాల వసతులు, మరమ్మతులపై దృష్టి పెట్టాలన్నారు. ఆరోగ్యశ్రీ వార్డు ను అభివృద్ధి చేయాలన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఆరోగ్యం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కని, ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించే బాధ్యత మనపై ఉందన్నారు. ప్రతి విభాగాధిపతిని వారి వారి విభాగంలో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సౌకర్యాల కల్పనకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. రాజేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్. కళావతిబాయి, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. కిరణ్ కుమార్, ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్. సైదులు, వైద్యాధికారులు, టీఎస్ ఎంఐడీసీ ఈఈ ఉమామహేశ్వర రావు, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ షఫీ యుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన ధరలు తగ్గించాలని.. ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండలంలోని కాకరవాయిలో ఏఐపీకేఎంఎస్ అధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈసందర్భంగా నాయకులు తిమ్మిడి హనుమంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుతో వ్యవసాయకూలీలపై భారం మోపుతున్నాయని నిత్యావసరల ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఒకేసారి గ్యాస్‌పై రూ.50పెంచడం అన్యాయమ న్నారు. ఈకార్యక్రమంలో పార్టీనాయకులు బానోతు లింగా, వెంకటమ్మ, ఉప్పలమ్మ, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

## కేఎంసీకి మల్లీశ్వరి రాక

**రాష్ట్ర స్థాయిలో ఫైల్ క్లియర్.. ఏ హోదా ఇస్తారని చర్చ**

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా, డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించి హైదరాబాద్‌కు ఉద్యోగ బాధ్యతలకు వెళ్లిన మల్లీశ్వరి తిరిగి ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో సీడీఎంఏ, సెక్రటేరియట్‌లో ఫైల్ క్లియర్ జరిగినట్లు బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థలోని ఒక వర్గం నాయకులకు సమాచారం అందింది. దీంతో తిరిగి ఏ హోదా వస్తుందా అని ఆ వర్గం ఉద్యోగులు ఊహాగానాల్లో తేలిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేఎంసీలో చర్చలు సైతం పెట్టారు.

## సింగారెడ్డిపాలెం స్వీపర్‌కు సాయం



నేలకొండపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో కాంటింజెంట్ స్వీపర్‌గా పని చేస్తున్న షేక్.ఖాదర్‌కు బుధవారం మధ్యాహ్నం పాఠశాలలో జరిగిన ఓకార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు మండల విద్యాధికారి చేతుల మీదుగా రూ.15,500 నగదును సహాయంగా అందచేసారు. వివరాల ప్రకారం ఇటీవలి కాలంలో ఖాదర్ భార్య లాల్‌బీ ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. పెద్ద మొత్తంలో వైద్యంకు ఖర్చు కాగా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు వారి శక్తిమేర కొంత ఆర్థిక సహాయం అందచేసారు. అందులో భాగంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలిన చలపతిరావు చేతులమీదుగా టీపీటీఎఫ్ నాయకులు రూ.15,500 నగదును సహాయంగా ఖాదర్‌కు అందచేసారు. కార్యక్రమంలో ఎంఈవో బాలిన చలపతిరావుతో పాటుగా టీపీటీఎఫ్ జిల్లా నాయకుడు తేజావత్ వెంగళరావు, మండల అధ్యక్షుడు తేజావత్ గోవిందరావు, రాజేశ్వరపురం పీఎస్ హెచ్ఎం బాణోతు నాగేశ్వరరావు, సింగారెడ్డిపాలెం ఇన్‌చార్జ్ హెచ్ఎం కావూరి ఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ఫ్లెక్సీల తొలగింపు


ఫ్లెక్సీని తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారులు, వీదుల వెంట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కేఎంసీ డీఆర్ఎఫ్ బృందాలు తొలగించాయి. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఫ్లెక్సీలు తెచ్చిన కరెంట్ కష్టాలు' కథనంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. నిబంధనలకు విరుద్ధగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. దీంతో డీఆర్ఎఫ్ బృందాలు ఫ్లెక్సీలను తొలగించారు.

## ధాన్యానికి మంచి మద్దతు ధర

తిరుమలాయపాలెం, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): రబీలో రైతులు పండించిన వరి ధాన్యంకు ప్రభుత్వం మంచి మద్దతు ధర అందిస్తుందని జేడీఏ పుల్లయ్య తెలిపారు. బుధవారం మండలంలోని మేడిదపల్లి గ్రామంలో వరిపొలాలను పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మితే మద్దతు ధరతో పాటు బోనస్ కూడా పొందవచ్చన్నారు.

## నేడు మంత్రి పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం మండలంలో పర్యటించనున్నట్టు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఇస్లావత్‌తండా, మేడిదపల్లి, ఏలువారిగూడెం, తెట్టలపాడు, తదితర గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంబిస్తారని తెలిపారు. అనంతరం పిండిప్రోలులో సీసీ రోడ్లు, పీఏసీఎస్ గోడౌన్, షాపింగ్‌కాంప్లెక్స్ సమదాయం ప్రారంబిసాతరని తిరుమలాయపాలెం సాయంత్రం 6గంటలకు సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, పీఏసీఎస్‌నూతన ప్రారంభం చేస్తారని, ఆయా గ్రామాల్లో జరిగే సభలో ప్రసంగిస్తారన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానం చేసినట్టేనని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా అన్నారు. బుధవారం కళాశాలలో ఐక్యూఏసీ జువాలజీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఖమ్మం లయన్స్ క్లబ్, ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిదానాల్లో కన్నా రక్తదానం ఉన్నతమైందన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఏఎల్ ఎస్ శాస్త్రి, డాక్టర్ ఎం.సునంద, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉద్యమ రూపకర్త చంద్ర రాజేశ్వరరావు



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీకి సుదీర్ఘకాలం పాటు జాతీయ కార్యదర్శిగా పనిచేసిన చంద్ర రాజేశ్వరరావు జాతీయ స్థాయిలో అనేక ఉద్యమాలకు రూపకల్పన చేశారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్ పేర్కొన్నారు. బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సభను నిర్వహించారు. జమ్ముల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో నాయకులు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు చేపట్టిన ప్రజా ఉద్యమాలు, పోరాటాలను వివరించారు. నాయకులు నైజాం సంస్థానంలో భూస్వామ్య దొరల దోపిడికి వెట్టి చాకిరికీ వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. తెలంగాణలోని పూర్వ వరంగల్, నల్గొండ, జిల్లాలో పర్యటించి ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోశారన్నారు. నాయకులు యర్రా బాబు, జానిమియా, కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతాదేవి, శింగు నర్సింహారావు, పోటు కళావతి, సలామ్, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మీనారాయణ, తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

## టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా లక్ష్మి



ఖమ్మం లీగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్‌సెల్ జాయింట్ కన్వీనర్‌గా ఖమ్మానికి చెందిన న్యాయవాది కేవీవీ లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం బార్ అసోసియేషన్ న్యాయవాది లక్ష్మి గతంలో మహిళా ప్రతినిధిగా, ప్రస్తుతం క్రీడల కార్యదర్శిగా కొనసాగుతుంది. తన నియామకానికి సహకరించిన జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, లీగల్ సెల్ కన్వీనర్ సింగం జనార్ధన్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో నోటరీ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు అన్నారు. నూతనంగా ఎన్నికైన నోటరీ న్యాయవాదసంఘం కార్యవర్గ సభ్యులు బుధవారం ఆయనను కలిసి సమస్యలపై చర్చించారు. నోటరీలసంఘం గౌరవాధ్యక్షుడి హోదాలో నోటరీ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నోటరీ న్యాయవాదసంఘం అధ్యక్షుడు పారుపల్లి అమర్‌చంద్, ఉపాధ్యక్షుడు కన్నేటి వెంకటరమణారావు, ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్‌చౌదరి, సంయుక్త కార్యదర్శి రాజవరం నారాయణస్వామి, కోశాధికారి మందా రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైరాలో టీయూసీఐ ర్యాలీ

వైరా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైరాలో బుధవారం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) ఆధ్వర్యంలో మోటర్‌సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈనెల 13 న వైరాలోని కామిశెట్టి కల్యాణమండపంలో జరిగే టీయూసీఐ ఖమ్మంజిల్లా ప్రథమ మ హాసభలను విజయవంతం చేయాలని కోరు తూ మోటర్‌సైకిల్ చేశారు. ఈ కార్యక్రమంలో సీవై.పుల్లయ్య, యలదండి బాబు, కె.దర్గయ్య, దస్తగిరి, కె.అర్జున్‌రావు, పాశం అ ప్పారావు, కన్నెగంటి వెంకటేశ్వరరావు, సైదులు, పర్సా బద్రీ, ఎర్రనాగులు హన్మంతరావు, నున్నావత్ శ్రీను, రాము పాల్గొన్నారు.

### కల్లూరులో...

కల్లూరు: వైరాలో ఈ నెల 13న జరగను న్న టీయూసీఐ ఖమ్మం జిల్లా ప్రథమ మ హాసభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కల్లూరులో ఆ సంఘం నాయకులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వెంక న్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏరియా అధ్యక్షుడు సత్యం, నాయకులు మాధవరావు, కోటేశ్వరరావు, జె. మాల్యాద్రి, ఎం. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ చరిత్ర, సంస్కృతి పుస్తకావిష్కరణ

మధిర రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ, ఉచిత పుస్తక వితరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి రచించిన బీఏ స్టడీ మెటీరియల్(తెలంగాణ చరిత్ర సంస్కృతి) పుస్తకాలను ఆవిష్కరించారు. బీఏ ఆరో సెమిస్టర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.అరుణ చేతులమీదుగా ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ఉత్తమ మార్కులు సాధించడం ద్వారా జీవితంలో ఉన్నతులుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎస్.ఇందిరా, డాక్టర్ పి.సుజాత, వెంకటలక్ష్మి, సుబ్బరాజు, ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

## వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించాలి

మధిరటౌన్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో నిర్మాణం పూర్తైన వంద పడకల ఆస్పత్రిని వెంటనే ప్రారంబించాలని బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మధిరలో వంద పడకల ఆసుపత్రి వద్ద ప్రభుత్వ తీరుకు నిరసనగా బీజేపీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.



## గ్రూప్-1 ర్యాంకర్‌కు సన్మానం

వైరా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1లో ర్యాంకు సాధించిన సంగెపు లక్ష్మీసాహితిని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సన్మానించారు. బుధవారం ఖమ్మంలో అభిరామ్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్స్, గ్రూప్-1,2కు సిద్ధమయ్యే అభ్యర్థులకు నిర్వహించిన ఉచిత అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైరాకు చెందిన గ్రూప్-1 ర్యాంకర్ లక్ష్మీసాహితిని కలెక్టర్ సన్మానించి అభినందించారు.



లక్ష్మీసాహితిని సన్మానిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

# శిథిలావస్థలో వంతెనలు

» భయాందోళనలో వాహనదారులు » పట్టించుకోని అధికారులు » నూతన వంతెనలు నిర్మించాలని వినతి

కొణిజర్ల, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలంలోని సాగ ర్ ప్రధానకాల్వ 18వ కిలోమీటర్ వద్ద తనికెళ్ల నుంచి బోడియాతండాకు వెళ్లే రహదారికి ప్రధానకాల్వపై నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. రక్షణ గోడలు కూలిపోయాయి. దాంతో ఆ బ్రిడ్జి పై అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇటీవల కాలంలో ఆ బ్రిడ్జి వద్ద రక్షణగోడలు లేక ఓ ట్రాక్టర్ అదుపు తప్పి కాల్వలో పడింది. దాంతో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. అయినా అధికారులు పట్టించుకోలేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇంతవరకు కూడా ఆ బ్రిడ్జికి రక్షణ గోడలు నిర్మించలేదు. ఆ బ్రిడ్జి నుంచి బోడియాతండా, గణేశ్వరం గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తున్నారు. రాత్రివేళల్లో ప్రమాదకరంగా బ్రిడ్జి నుంచి వెళ్లలేకపోతున్నారు. మరెన్ని ప్రమాదాలు జరిగితే సంబంధిత అధికారులు పట్టించుకుంటారోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తనికెళ్ల దగ్గర మెయిన్ కెనాల్ నుంచి వస్తున్న బీబీసీ కాల్వ బ్రిడ్జి కూడా శిథిలావస్థకు చేరింది. రెండు వాహనాలు పట్టే పరిస్థితిలేదు. అంతేకాకుండా బ్రిడ్జి అడుగుభాగం గంపెచ్చులు ఊడుతూ ఇనుపచువ్వలు కనిపిస్తున్నాయి. నిత్యం ఆ బ్రిడ్జి పై నుంచి వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ క్షణంలో ఏమీ జరుగుతందోనని ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా నీటిపారుదలశాఖ అధికారులు బ్రిడ్జిల వద్ద రక్షణగోడలు ఏర్పాటు చేసి కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న తనికెళ్ల వద్ద బీబీసీ కెనాల్ వంతెన


రక్షణ గోడ లేని సాగర్ ప్రధానకాల్వ బ్రిడ్జి

### ఆ బ్రిడ్జి పై నుంచి వెళ్లాలంటేనే భయం వేస్తుంది



**వడ్త్యా వీరన్న, బోడియా తండా**

ఆ బ్రిడ్జి పై నుంచి రాకపోకలు సాగించకతప్పదు. వెళ్లాలంటేనే భయం వేస్తుంది. గతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. రాత్రి వేళల్లో ప్రయాణించాలంటేనే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని వస్తున్నాం. కొణిజర్ల రావాలంటే తనికెళ్ల మీదుగా రావాలి. అది బ్రిడ్జి నుంచి రాక తప్పడంలేదు. నిత్యం అవసమైన బ్రిడ్జి. రక్షణ గోడలు ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడాలి.

## మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దయానంద్

తల్లాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే ధాన్యం విక్రయించి లాభం పొందాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం తల్లాడ మండలం బస్వాపురం, కుర్నవల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌లు దిరిశాల నర్సింహారావు, అయిలూరి ప్రదీప్‌రెడ్డి, ఏవో ఎండీ.తాజుద్దీన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్ పాల్గొన్నారు.

**బోనకల్‌లో...**

బోనకల్: మండలంలోని కలకోట, రాయనపేట గ్రామాలలో బుధవారం సొసైటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యాన్ని క్వింటాకు రూ. 2320, కామన్ గ్రేడు రకాన్ని రూ. 2300లకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో మల్లికార్జున్, ఏఈవో నాగసాయి, పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

వైరా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన పోలీసు కానిస్టేబుల్ బండి కృష్ణ కుటుంబానికి ఖమ్మంజిల్లా 2009 సివిల్ కానిస్టేబుల్ బ్యాచ్ కమిటీ నుంచి రూ.రెండులక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇటీవల ఖమ్మం వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న 2009బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ బండి కృష్ణ దశదినకర్మలు బుధవారం రెబ్బవరంలో జరిగాయి. ఆత్మహత్య చేసుకున్న కృష్ణ కుటుంబానికి ఆకమిటీ సభ్యులు బాల్యా, బాలాజీ, విజయ్, రామారావు, నర్సింహారావు, శ్రీకాంత్, లావుడ్యా రమేష్, సురేష్, రమేష్, బాగి రమేష్‌లు ఈ సహాయాన్ని అందజేశారు.

## అంబేద్కర్ జయంతిని జయప్రదం చేయాలి

వైరా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తితో ఈనెల 11నుంచి 14వతేదీ వరకు వాడవాడలా నిర్వహించే అంబేద్కర్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ బొంతు సమత అధ్యక్షతన బుధవారం వైరాలో జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించాలి: బీజేపీ

మధిరటౌన్, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో నిర్మాణం పూర్తైన వంద పడకల ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మధిరలో వంద పడకల ఆసుపత్రి వద్ద ప్రభుత్వ తీరుకు నిరసనగా బీజేపీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ అధ్యక్షులు శివరాజు సుమంత్, గుండా పాపిరెడ్డి, చిలివేరు సాంబ, పాపట్ల రమేష్, గద్దం శ్రీహరి, నాగేశ్వరరావు, వేణు, శ్రీను, అర్జునరావు పాల్గొన్నారు.

## సీతమ్మ ఆశయాలు సాధించాలి: సీపీఎం

కొణిజర్ల,ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన దొడ్డపునేని సీతమ్మ సంస్మరణలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, కొప్పుల కృష్ణయ్య పాల్గొని సీతమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డపునేని కృష్ణార్జునరావు, మాజీ సర్పంచ్ దొడ్డపునేని జ్యోతి, వడ్లమూడి నాగేశ్వరరావు, తాళ్లపల్లి కృష్ణ, సుంకర్ సుధాకర్, చింతనిప్పు చలపతి మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, షేక్ అఫ్జల్, రోషన్‌బేగ్, సంక్రాంతి నర్సయ్య, మాజీ ఎంపీపీ వడ్లమూడి ఉమారాణి, అన్నారపు వెంకటేశ్వర్లు, బొంతు సమత, తాళ్ళపల్లి విజయ పాల్గొన్నారు.

## పుస్తకావిష్కరణ కార్యక్రమం

మధిర రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ, ఉచిత పుస్తక వితరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి రచించిన బీఏ స్టడీ మెటీరియల్(తెలంగాణ చరిత్ర సంస్కృతి) పుస్తకాలను ఆవిష్కరించారు. బీఏ ఆరో సెమిస్టర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.అరుణ చేతులమీదుగా ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎస్.ఇందిరా, డాక్టర్ పి.సుజాత, వెంకటలక్ష్మి, సుబ్బరాజు, ఫణీంద్రకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యం

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఐసీడీఎస్ సీడీపీవో ఎస్.కనకదుర్గ అన్నారు. బుధవారం సత్తుపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంతో పాటు మండంలోని తుంబూరులో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మహాలక్ష్మి, సుజాత, హెచ్ఎస్ బీ.శారారాణి, ఏఎన్ఎం తాయమ్మ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మహాలక్ష్మి

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం: సండ్ర


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటవీరయ్య

తల్లాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. బుధవారం తల్లాడ మండలం నారాయణపురంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన రైతుభరోసా, రూ.రెండులక్షల రుణమాఫీ, పంటలకు బోనస్ వంటి వాటిని అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నమ్మి ఓట్లేసిన అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసుగుచెంది బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపేందుకు ముందుకొస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, దిరిశాల దాసూరావు, దగ్గుల శ్రీనివాసరెడ్డి, నాయుడు శ్రీనివాసరావు, బద్దం కోటిరెడ్డి, కేతినేని చలపతిరావు, సొసైటీ వైస్‌చైర్మన్ కటికి నర్సింహారావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జీవీఆర్, వజ్రాల రామిరెడ్డి, మురళీధర్‌రావు, పాల్గొన్నారు.

## నేడు రాజీవ్ వికాస పథకంపై అవగాహన

వైరా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గస్థాయిలో గురువారం రాజీవ్ యువ వికాస పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రాజీవ్ యువ వికాస పథకంపై అధికారులు, మతపెద్దలతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని, అందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

## సన్నబియ్యం భోజనాలు

వైరా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారపనేనిపల్లి గ్రామంలో బుధవారం ఏకలవ్య వారసుల కుటుంబీకులతో కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యంతో భోజనాలు చేశారు. జిల్లా కిసాన్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దాసరి దానియేలు, మండల అధ్యక్షుడు చింతనిప్పు మాధవరావు తదితరులు సన్నరకం బియ్యంతో భోజనం చేసి లబ్ధిదారులైన బాలకృష్ణ, రాధతో ముచ్చటించారు. కార్యక్రమంలో రాచబంటి పెద్ద కృష్ణ, చిన్నకృష్ణ, గారపాటి సాంబశివరావు, సత్తెనపల్లి నర్సింహారావు పాల్గొన్నారు.

## వైరాలో టీయూసీఐ ర్యాలీ

వైరా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైరాలో బుధవారం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) ఆధ్వర్యంలో మోటర్‌సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈనెల 13న వైరాలోని కామిశెట్టి కల్యాణమండపంలో జరిగే టీయూసీఐ ఖమ్మంజిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మోటర్‌సైకిల్ చేశారు. ఈకార్యక్రమంలో సీవై.పుల్లయ్య, యలదండి బాబు, కె.దర్గయ్య, దస్తగిరి, కె.అర్జున్‌రావు, పాశం అప్పారావు, కన్నెగంటి వెంకటేశ్వరరావు, సైదులు, పర్సా బద్రీ, ఎర్రనాగులు హన్మంతరావు, నున్నావత్ శ్రీను, రాము పాల్గొన్నారు.

**కల్లూరులో...**

కల్లూరు: వైరాలో ఈ నెల 13న జరగనున్న టీయూసీఐ ఖమ్మం జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కల్లూరులో ఆ సంఘం నాయకులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏరియా అధ్యక్షుడు సత్యం, నాయకులు మాధవరావు, కోటేశ్వరరావు, జె. మాల్యాద్రి, ఎం. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లను పుట్టనిద్దాం..ఆడపిల్లను పెరగనిద్దాం

» సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ

వైరా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో జిల్లాలో ఆడపిల్లను పుట్టనిద్దాం-ఆడపిల్లను పెరగనిద్దాం అనే నినాదంతో మాఇంటి-మణిదీపం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని గొల్లపూడిలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన వరికూటి మమత-వేణుగోపాల్ దంపతులను కస్తాల సత్యనారాయణ, ఎంపీడీవో సరస్వతీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బిజాన్‌బీ, శ్రీలక్ష్మి, సరిత, హెల్త్ సూపర్‌వైజర్ కనకతార, పంచాయతీ కార్యదర్శి కోట సునీత, అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, పద్మ, మనోజ, పాల్గొన్నారు.

**సత్తుపల్లిలో...**

సత్తుపల్లి: ఆలోచనల్లో మార్పు వస్తేనే ఆడపిల్లకు సమానత్వం, అప్పుడే సమాజంలో మహిళలు విద్యా,ఉద్యోగ,రాజకీయ రంగాల్లో రాణిస్తారని మండల ప్రత్యేకాధికారి పీ.సునీల్‌రెడ్డి అన్నారు. మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తుంబూరులో ఆడబిడ్డకు జన్మనిచ్చిన రావిటి సాయిజ్యోతి, వెంకటేశ్వరరావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే.యోగేశ్వరరావు, ఎంపీడీవో చిన్న నాగేశ్వరరావు, ఈజీఎస్ ఏపీవో ఎం.బాబు, సీడీపీవో ఎస్.కనకదుర్గ, సెక్రటరీ నవీన్, బీ.మాధవి, రుక్మిణి, జయమ్మ, పద్మావతి, ఏఎన్ఎంలు వెంకటమ్మ, సునీత పాల్గొన్నారు.

**కారేపల్లిలో...**

కారేపల్లి: ఆడపిల్లలు ఇంటికి మణిదీపంలాంటివారని మండల ప్రత్యేక అధికారి కె.నవీన్‌బాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాధారంగ్రామంలో జి.స్రవంతి, ఉపేందర్ దంపతులకు మహాలక్ష్మి పుట్టినందుకుగాను వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జి.సురేందర్, విజయ్‌కుమార్, తదితరులున్నారు.

**ముదిగొండలో**

ముదిగొండ: ముదిగొండలో బుధవారం మాఇంటి-మణిదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, వైద్యాధికారి అరుణాదేవి, ఎంపీడీవో శ్రీధర్ స్వామి, ఏసీడీపీవో శారదాశాంతి, సూపర్‌వైజర్ ఉమారాణి, హెల్త్ సూపర్‌వైజర్ లత, వినోదలక్ష్మి, పుష్పలత, పద్మ, చంద్రకళ, కుమారి పాల్గొన్నారు.

**కొణిజర్లలో...**

కొణిజర్ల: అడపిల్లే ఇంటికి ముద్దని ఐసీడీఎస్ ఏసీడీపీవో ఉషారాణి, ఎంపీడీవో రోజారాణి తెలిపారు. బుధవారం మండలంలోని సాలెబంజర పంచాయతీ క్రాంతినగర్ అంగన్‌వాడి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన వసంత, నాగేశ్వరరావు దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ టీచర్‌లు లక్ష్మి, లలిత పాల్గొన్నారు.

**కల్లూరులో...**

కల్లూరు: కల్లూరు గ్రామ పంచాయతీ శివారు శ్రీరాంపురంలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బేటీ జన్మోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్లను జన్మనిచ్చిన మెరుగు మౌనిక కుటుంబ సభ్యులను ఐసీడీఎస్ అధికారులు, ఎంపీడీవో చంద్రశేఖర్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నిర్మలజ్యోతి, ఏసీడీపీవో రత్తమ్మ, సూపర్‌వైజర్లు భవానీ, సంధ్యారాణి, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగళ్లపాడు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మా ఇంటి మణిదీపం కార్యక్రమం బుధవారం నిర్వహించారు ఈసందర్భంగా గ్రామంలో నగ్నుర్తి నారాయణ, జ్యోతి దంపతులకు జన్మించిన ఆడపిల్ల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను నాయన్మను శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమలో మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ అలీమ్, ఎంపీడీవో సురేందర్, ఎంఈవో మురళీమోహన్, ఏసీడీపీవో కృష్ణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.


ఆడపిల్లకు జన్మనిచ్చిన దంపతులను సన్మానిస్తున్న డీడీ కస్తాల సత్యనారాయణ


కల్లూరులో....


ముదిగొండలో ...


సత్తుపల్లిలో...


ఎర్రుపాలెంలో...

## రేకుల ఇల్లు ధ్వంసం

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులకు మండలంలోని బేతుపల్లికి చెందిన సిద్దినబోయిన నాగమణి ఇంటిపై రేకులు గాలికి ఎగిరిపోగా తడికలు చెల్లాచెదురయ్యాయి. సుమారు రూ.35వేల మేర ఆస్తినష్టం వాటిల్లింది. అదేవిధంగా మండలంలోని కిష్టాపురంలో ఆరేపల్లి చెన్నారావుకు చెందిన రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమవ్వగా, షెడ్డులోని పశువులకు స్వల్పగాయలయ్యాయి. సుమారు రూ.70 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లింది.

## చెక్‌పోస్టు తనిఖీ

మధిర రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు వద్దగల మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును చైర్మన్ బండారు నర్సింహారావు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ధాన్యం లారీలను చెక్ చేసిన తర్వాతనే పంపించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ చంద్రశేఖర్, సూపర్‌వైజర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

కారేపల్లి, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శాంతినగరం గ్రామానికి చెందిన మండల మున్నూరుకాపు సంఘం నాయకుడు ఇప్ప సత్యం (65)గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గమిడి నర్సింహారావు,ముత్యాల సురేష్, కోశాధికారి వాకాటి సురేష్‌లు సత్యం భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పగడాల మంజూల, హనుమకొండ రమేష్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

వైరా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుణ్యపురం గ్రామంలో సింగిల్ ఫేజ్ 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం వైరా ట్రాన్స్‌కో డీఈ బండి శ్రీనివాసరావు ప్రారంభించారు. నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు సరఫరా చేసేందుకుగానూ ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశామని డీఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ పోతగాని కిరణ్‌కుమార్, ఏఈ పాలేటి వెం కట సాయికుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, లైన్‌మన్ పాషా పాల్గొన్నారు.

## వైరాలో భద్రాద్రి బ్యాంకు బ్రాంచ్ ప్రారంభం

వైరా, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైరా మెయిన్ రోడ్డులో భద్రాద్రి బ్యాంకు 22వ శాఖను ఆబ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి బుధవారం ప్రారంభించారు. వైరా వర్తకసంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు స్ట్రాంగ్‌రూమ్‌ను, అయ్యప్ప ఆలయ చైర్మన్ కొప్పురావూరి వెంకటేశ్వరరావు క్యాష్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈవో దాసరి వేణుగోపాల్, డీజీఎం ఎల్‌వీఎస్.ప్రసాద్, వైస్‌చైర్మన్లు సన్నే ఉదయప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థులకు పూర్తి మద్దతు

» బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు


సత్తుపల్లిలో నాయకులను సన్మానిస్తున్న నంబూరి

సత్తుపల్లి, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): రాబోయే ప్రతి ఎన్నికలలో బీజేపీ తరపున పోటీచేసే ప్రతి అభ్యర్థికి పూర్తి మద్దతు ఉంటుందని ఆపార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో క్రీయాశీలక కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయుడు రాఘవరావు, పాలకొల్లు శ్రీను, ఆచంట నాగస్వామి, శివ, మధు, వసంతరావు, శేషగిరి, శివకృష్ణ, భాస్కరరావు, నరసింహారావు, వంశీకృష్ణ, సుభానీ, మధు తదితరులు పాల్గొన్నారు.

**తల్లాడలో...**

తల్లాడ: ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక జీఎన్ఆర్ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు చల్లా నాగులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, చల్లా నరేష్, పెరిక కిరణ్, పులి వెంకటేశ్వర్లు, రాయల ర మేష్, యద్దన్నపూడి శ్రీనివాసరావు, ఉద్దగిరి రామారావు, వెల్లంకి సుధాకర్ పాల్గొన్నారు.

**కల్లూరులో...**

కల్లూరు: రైతులు పండించి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో వేగంగా జరపాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కల్లూరు మండల పరిధిలోని పేరువంచ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో పొలంబాట, రైతన్నకు అండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గుండపునేని అనిల్, వెంకటరెడ్డి, అనంగి నరిసింహారావు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

**తల్లాడలో....**

తల్లాడ: ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక జీఎన్ఆర్ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు చల్లా నాగులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా నాయకులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, చల్లా నరేష్, పెరిక కిరణ్, పులి వెంకటేశ్వర్లు, రాయల రమేష్, యద్దన్నపూడి శ్రీనివాసరావు, ఉద్దగిరి రామారావు, వెల్లంకి సుధాకర్ పాల్గొన్నారు.